RNI : APTEL / 2023 / 89152

1St Year Happy Work Anniversary.

షణ్ముఖ

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు          తెలుగు దినపత్రిక

Good for Health
Best for Readers
THE POWER OF PEN RK

సంపుటి : 2 సంచిక : 182 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ మంగళవారం 27 మే 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 02 ISSUE : 182 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Tuesday 27 May 2025 PAGES : 8 PRICE : 3/-

## పాకిస్థాన్.. టెర్రరిజాన్ని టూరిజంగా భావిస్తోంది



(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 26)

పాకిస్థాన్ టెర్రరిజాన్ని ఓ టూరిజంగా భావిస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత తొలిసారి తన సొంత రాష్ట్రం గుజరాత్‌లో పర్యటించిన ఆయన.. భుజ్‌లో ఏర్పాటు చేసిన సభలో పాకిస్థాన్ తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఉగ్రవాదం అనేది పాకిస్థాన్‌కు జీవనాధారమన్నారు. పాక్ ప్రభుత్వం, సైన్యం తమ సొంత ప్రయోజనాల కోసం ఉగ్రవాదానికి మద్దతు ఇస్తున్న విషయాన్ని అక్కడి ప్రజలు అర్థం చేసుకోవాలని సూచించారు. తమ జీవితాలను నాశనం చేస్తున్న ఈ ఉగ్రవాదం ముప్పును అంతం చేసేందుకు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. పాక్ ప్రజలు శాంతి మార్గాన్ని ఎంచుకోకపోతే.. భారత సైన్యం ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

రూ.50వేల కోట్ల విలువైన ప్రాజెక్టులను కచ్ జిల్లాలో ప్రారంభించిన అనంతరం భుజ్‌లో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. మే 26 నాటికి 11 ఏళ్ల పదవీ కాలం పూర్తి చేసుకున్న ప్రధాని.. భారత్ జపాన్‌ను అధిగమించి ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని తెలిపారు. పాక్ పౌరులు తమ దేశం ఎక్కడ ఉందో ఆలోచించుకోవాలని సూచించారు. భారత్ పర్యాటక రంగాన్ని విశ్వసిస్తుండగా.. పాకిస్థాన్ మాత్రం ఉగ్రవాదాన్నే పర్యాటకంగా పరిగణిస్తోందన్నారు. ఇది యవత్ ప్రపంచానికే ప్రమాదకరమని తెలిపారు.

### పాక్ ప్రజలారా.. ఏం సాధించారు?

“నేను పాకిస్థాన్ ప్రజల్ని ఒక విషయం అడగాలనుకుంటున్నా. మీరు ఏం సాధించారు? నేడు భారత్ ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ. కానీ మీ పరిస్థితి ఏంటీ? ఉగ్రవాదాన్ని ప్రోత్సహించిన వారు మీ భవిష్యత్తును నాశనం చేస్తున్నారు. ఉగ్రవాదం మీ పాలకులు, సైన్యానికి డబ్బు సంపాదించే మార్గం. ఉగ్రవాదాన్ని అంతం చేసేందుకు –మిగతా 2లో

## దేశీయ సౌర విద్యుత్ ఉత్పత్తిలో ఏపీకి పెద్దపీట

**2030 నాటికి 500 గిగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి దేశ లక్ష్యమన్న చంద్రబాబు**

**దేశీయంగా సౌర పరికరాల తయారీ సామర్థ్యం పెంపుపై కేంద్రం దృష్టి**

**సౌర విద్యుత్ తయారీని ప్రోత్సహించేందుకు ఏపీ ప్రభుత్వ సమగ్ర విధానం**

**రాష్ట్రంలో లక్షల ఉద్యోగాల కల్పన**



(షణ్ముఖ వెలుగు, అమరావతి, మే 26)

సౌర విద్యుత్ తయారీ రంగంలో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషిస్తోందని, భారత్ సౌర తయారీ కేంద్రంగా రాష్ట్రం ఎదుగుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. దేశం నిర్దేశించుకున్న హరిత లక్ష్యాలను చేరుకోవడంలో భాగంగా, స్థానికంగానే సౌర విద్యుత్ పరికరాల తయారీని ప్రోత్సహించడంపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. 2030 నాటికి 500 గిగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తిని సాధించాలనేది మన దేశపు సమున్నత లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఈ లక్ష్య సాధనలో భాగంగా –మిగతా 2లో

## ఉగ్రస్థావరాలపై దాడి తర్వాతే పాక్‌కు సమాచారం

(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 26)

ఆపరేషన్ సిందూర్‌లో ఉగ్ర స్థావరాలపై దాడులు పూర్తయ్యాకే పాకిస్థాన్‌కు సమాచారం అందించామని విదేశాంగ మంత్రి జైశంకర్ స్పష్టతనిచ్చారు. అప్పటికే ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరోలో కూడా ప్రకటన విడుదలైందన్నారు. విదేశాంగశాఖకు చెందిన కాన్సులేటీవ్ కమిటీ ఆఫ్ పార్లమెంట్ సమావేశం సందర్భంగా ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. “ఉగ్ర స్థావరాలపై దాడులు ముగిశాక. పాకిస్థాన్‌కు చెందిన డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డీజీఎంవో)కు సమాచారం అందించాము. అప్పటికే పీఐబీ తొలి ప్రకటన జారీ అయింది” అని జైశకంర్ ప్యానల్‌కు వెల్లడించారు. ఎంపీల బృందాలు ప్రపంచంలోని వివిధ ప్రదేశాల్లో పర్యటిస్తున్న వేళ.. దేశం మొత్తం ఒక్కతాటిపై నడవాలని అభ్యర్థించారు. ఉగ్రస్థావరాలపై ఆపరేషన్ కంటే ముందే పాక్ చెప్పినట్లు కాంగ్రెస్ ప్రచారం చేయడం.. వాస్తవాలను వక్రీకరించడమేనని ఆయన వ్యాఖ్యానించినట్లు సీఎన్‌బీసీ-న్యూస్18 కథనంలో పేర్కొంది.



పాక్‌కు సమాచారం విషయంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా తప్పుపట్టిన విషయం తెలిసిందే. ఇస్లామాబాద్‌కు ముందుగానే ఆపరేషన్ విషయం చెప్పడం ఏమిటని ఆయన ప్రశ్నించారు.

## ఉగ్రవాదంతో 20వేల మందిని కోల్పోయాం



(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 26)

సింధూ జలాల ఒప్పందంపై ఐక్యరాజ్యసమితి (ఐరాస)లో పాకిస్థాన్ అసత్య ప్రచారం చేయడాన్ని భారత్ తీవ్రంగా ఖండించింది. ఒప్పంద స్ఫూర్తిని విస్మరించి ఇస్లామాబాద్ భారత్‌పై మూడుసార్లు యుద్ధానికి దిగిందని గుర్తుచేసింది. వేలసార్లు –మిగతా 2లో

## మోదీ హిమాలయ పర్వతాల వంటివారు.. ఎవరికీ తల వంచరు

**దేశాభివృద్ధే ప్రధాని మోదీ లక్ష్యమన్న పవన్**

**ఓట్ల కోసం మోదీ ఆలోచించరని వ్యాఖ్య**

**ఆపరేషన్ సిందూర్‌తో దేశ సత్తా చాటిన ఘనత మోదీదేనని ప్రశంస**



(షణ్ముఖ వెలుగు, అమరావతి, మే 26)

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఓట్ల గురించి ఆలోచించరని, దేశ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తారని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. హిమాలయ పర్వతాలు ఎలా తలవంచవో, అదే విధంగా మోదీ కూడా ఎక్కడా, ఎవరికీ –మిగతా 2లో

## భారత్ శక్తిమంతమైన సైనిక దేశంగా రూపొందాలి

(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 26)

భారత్‌ను శక్తిమంతమైన సైనిక దేశంగా, ఆర్థిక వ్యవస్థగా రూపొందించాలని ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్ అన్నారు. ఇందుకోసం హిందువులంతా ఐక్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు. భాగవత్ ఇంటర్వ్యూను ఆరెస్సెస్ అనుబంధ వారపత్రిక ‘ఆర్గనైజర్’ తాజా సంచికలో ప్రచురించింది. “నిజమైన బలం అంతర్గతమైనది. మనల్ని మనం రక్షించుకోగలగాలి. బహుళ శక్తులు కలిసి వచ్చినా ఎవరూ మనల్ని ఓడించలేరు. ప్రపంచంలో దూకుడును ప్రదర్శించే కొన్ని దుష్టశక్తులు ఉన్నాయి. సరిహద్దుల్లో వీటి చర్యలను మనం చూస్తున్నాం. ఇలాంటి సమయంలో శక్తిమంతంగా ఉండటం తప్ప మనకు మరో మార్గం లేదు” అని భాగవత్ వ్యాఖ్యానించారు.



## మళ్లీ పెరుగుతున్న కొవిడ్ కేసులు.. ఐసీఎంఆర్ చీఫ్ ఏమన్నారంటే?

(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 26)

దేశంలో మళ్లీ కొవిడ్ కేసులు కలకలం రేపుతున్నాయి. గత వారం రోజులుగా కేరళ, మహారాష్ట్ర, ఢిల్లీ, గుజరాత్, తమిళనాడు, కర్ణాటకలాంటి పలు రాష్ట్రాల్లో కొత్త కేసులు నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ రాజీవ్ బహల్ కీలక సూచనలు చేశారు. కరోనా కొత్త వేరియంట్ల పట్ల భయాందోళనలు అవసరం లేదన్నారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ప్రభుత్వం, ఇతర ఏజెన్సీలు ప్రస్తుత పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నాయని తెలిపారు. తన అభిప్రాయం ప్రకారం ప్రాథమిక జాగ్రత్తలు తీసుకోవడం మాత్రం అవసరమని పేర్కొన్నారు. ఎవరైనా క్యాన్సర్ రోగులు, రోగనిరోధక శక్తి సంబంధిత సమస్యలు ఉన్నవారైతే.. –మిగతా 2లో



## ఎక్కడకు రమ్మన్నా వస్తా కూటమి ప్రభుత్వానికి రోజా సవాల్

**పథకాలన్నీ ఆపేసి అప్పులు, అరాచకాలు చేస్తున్నారని రోజా మండిపాటు**

**ఎన్నికల హామీలు గాలికొదిలేశారని ఫైర్**

**హామీలను నెరవేరుస్తామని మహానాడులో తీర్మానం చేయగలరా అని ప్రశ్న**

(షణ్ముఖ వెలుగు, అమరావతి, మే 26)



ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వంపై మాజీ మంత్రి, వైసీపీ నాయకురాలు రోజా తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలకు మేలు చేసే పథకాలను నిలిపివేశారని, రాష్ట్రంలో అప్పులు, అక్రమాలు, అరాచకాలు పెరిగిపోయాయని ఆమె ఆరోపించారు. ఎన్నికలకు ముందు ఎన్నో హామీలు గుప్పించి, ఇప్పుడు వాటిని నెరవేర్చకుండా చేతులెత్తేశారని ప్రభుత్వంపై ఆమె మండిపడ్డారు.తెలుగుదేశం పార్టీ నిర్వహించబోయే మహానాడును ఉద్దేశించి కూడా రోజా ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తామని మహానాడులో ఒక తీర్మానం చేయగలరా? అంటూ ఆమె సవాల్ విసిరారు. ఇచ్చిన హామీలలో కనీసం ఒక్కటైనా నెరవేర్చినట్లు ప్రజలతో చెప్పించగలరా? అని ప్రశ్నించారు. ఈ విషయంపై చర్చించేందుకు మంగళగిరి, కుప్పం, పిఠాపురం, హిందూపురం.. ఇలా ఎక్కడికి రమ్మన్నా తాను వస్తానని రోజా సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకునే దమ్ము, ధైర్యం ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఉందా? అని నిలదీశారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చింది అక్రమాలు, అప్పులు, అరాచకాలు చేయడానికేనని మాజీ మంత్రి రోజా తీవ్రంగా విరుచుకుపడ్డారు.

## వైఎస్సార్ జిల్లా పేరు మారింది.. జీవో జారీ చేసిన ఏపీ ప్రభుత్వం

**వైఎస్సార్ జిల్లాకు మళ్లీ పాత పేరు**

**‘వైఎస్సార్ కడప జిల్లా’గా మార్పు**

**ప్రతిపక్ష నేతగా చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు మార్పు**

(షణ్ముఖ వెలుగు, అమరావతి, మే 26)

వైఎస్సార్ జిల్లా పేరును ‘వైఎస్సార్ కడప జిల్లా’గా పునరుద్ధరిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మార్పునకు సంబంధించి ఇటీవల జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా తాజాగా జీవో విడుదలైంది.వివరాల్లోకి వెళితే, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి మరణానంతరం కడప జిల్లాకు ఆయన జ్ఞాపకార్థం ‘వైఎస్సార్ కడప జిల్లా’గా నామకరణం చేశారు. అయితే, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ‘కడప’ పదాన్ని తొలగించి కేవలం ‘వైఎస్సార్ జిల్లా’గా వ్యవహరించడం మొదలుపెట్టింది. ఈ చర్యపై అప్పట్లో ప్రజాసంఘాలు, పౌరహక్కుల సంఘాలతో పాటు పలు రాజకీయ పార్టీల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. జిల్లా చారిత్రక గుర్తింపును తొలగించారనే విమర్శలు –మిగతా 2లో

## ఉత్తమ పాలన విధానాలతోనే వికసిత భారత్

(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 26)

దేశంలో ఎన్డీయే కూటమి పాలిత రాష్ట్రాలు ఉత్తమ పాలన విధానాలను ఆచరించి, వికసిత భారత్ లక్ష్యాలు సాకారమయ్యేందుకు దోహదపడాలని ప్రధాని నరేంద్రమోదీ పిలుపునిచ్చారు. ఆదివారం ఢిల్లీలో నిర్వహించిన ఎన్డీయే పక్షాల సీఎంలు, డిప్యూటీ సీఎంల సమావేశంలో ఆయన ప్రసంగించారు. కూటమి పక్షాలు ఆయా రాష్ట్రాల్లో అనుసరిస్తున్న ఉత్తమ అభ్యాసాలపై చర్చకు సమావేశంలో ఎక్కువ సమయం కేటాయించారు.



ఉత్తరాఖండ్‌లో ఉమ్మడి పౌరస్మృతి అమలు సహా సీఎంలు తమతమ రాష్ట్రాల్లో చేపట్టిన ఉత్తమ పాలన విధానాలు, ప్రభావవంతమైన కార్యక్రమాలు, పథకాల గురించి వివరించారు. వీటిని అధ్యయనం చేసి, ఇతర చోట్ల కూడా అమలు చేసేందుకు వీలుగా ఒక కమిటీని ఏర్పాటు చేయాలని మోదీ సూచించారు. ఎన్డీయే రాష్ట్రాలు సమన్వయంతో చేసే ప్రయత్నాలు.. వికసిత భారత్ లక్ష్యాలను సత్వరం చేరుకునేందుకు దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు. బడుగు బలహీనవర్గాలవారిని అభివృద్ధిపరమైన ప్రధాన స్రవంతిలోకి తీసుకువచ్చేందుకు కులగణన ఓ ముందడుగు అవుతుందని, అయితే తమ ప్రభుత్వం కుల రాజకీయాలను నమ్మబోదని చెప్పారు. అణగారిన వర్గాలకు సాధికారత కల్పించడానికి మాత్రం ప్రాధాన్యమిస్తామన్నారు. “రక్షణరంగంలో దేశం సాధించిన స్వయం సమృద్ధికి ఆపరేషన్ సిందూర్ విజయం ఒక తార్కాణం. ఇలాంటి అంశాలపై మాట్లాడేటప్పుడు ఎక్కడా హద్దు మీరవద్దు. ఈ ఆపరేషన్లో సైనిక బలగాలు ఎంతో ధైర్యసాహసాలతో పరాక్రమాన్ని ప్రదర్శించాయి. అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను వేగంగా తీర్చిదిద్దడం, శక్తిమంతమైన.. స్వయం సమృద్ధ దేశంగా తయారు చేయడం మన లక్ష్యం” అని మోదీ చెప్పారు.ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, జేపీ నడ్డా, రాజ్‌నాథ్‌సింగ్‌లతో –మిగతా 2లో

## మొదటి పేజీ తరువాయి

# పాకిస్థాన్.. టెర్రరిజాన్ని టూరిజంగా భావిస్తోంది

పాక్ ప్రజలు ముందుకు రావాలి. సంతోషంగా, ప్రశాంతంగా జీవించండి" అన్నారు.

**15 రోజులు వేచి చూశాం..**

"పహల్గాం ఘటన తర్వాత ఉగ్రవాదులపై పాకిస్థాన్ చర్యలు తీసుకుంటుందేమోనని మేం 15 రోజులు వేచి చూశాం. కానీ, ఉగ్రవాదమే వారికి ఆహార అస్త్రంగా మారినట్లు కనబడింది. మే 9 రాత్రి పాకిస్థాన్ మన పౌరులపై దాడి చేయడానికి ప్రయత్నించినప్పుడు, మన సైన్యం రెట్టింపు శక్తితో దాడి చేసి వారి వైమానిక స్థావరాలను ధ్వంసం చేసింది. ఉగ్రవాదంపై పోరులో మన సైన్యానికి స్వేచ్ఛనిచ్చాం. మానవత్వాన్ని రక్షించడం, ఉగ్రవాదం అంతం కోసమే 'ఆపరేషన్ సిందూర్' చేపట్టాం" అన్నారు.

# దేశీయ సౌర విద్యుత్ ఉత్పత్తిలో ఏపీకి పెద్దపీట

సౌర విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన అన్ని రకాల పరికరాలను దేశీయంగానే తయారుచేసుకునే సామర్థ్యాన్ని పెంపొందించుకోవడం అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. ఈ దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సౌర విద్యుత్ పరికరాల తయారీని ప్రోత్సహించేందుకు ఒక సమగ్రమైన విధానాన్ని రూపొందించి అమలుచేస్తోందని వివరించారు.రాష్ట్ర ప్రభుత్వ విధానాలు సత్ఫలితాలనిస్తున్నాయని, దీని ఫలితంగా ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు భారతదేశ సౌర విద్యుత్ తయారీ కేంద్రంగా రూపుదిద్దుకుంటోందని చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి మరింత మంది తయారీదారులను ఆకర్షించడం ద్వారా, భారతదేశ హరిత ఇంధన పరివర్తన ప్రక్రియలో మన రాష్ట్రం చురుకైన పాత్ర పోషిస్తుందని ఆయన స్పష్టం చేశారు. అదే సమయంలో, ఈ పరిశ్రమల ద్వారా మన రాష్ట్ర ప్రజలకు లక్షలాదిగా ఉద్యోగ అవకాశాలు కూడా లభిస్తాయని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఉగ్రవాదంతో 20వేల మందిని కోల్పోయాం

ఉగ్రవాదాన్ని ఎగదోసి అమాయకుల మరణానికి కారణమైందని ఆరోపించింది. "సాయుధ ఘర్షణలో జలాలను సంరక్షించుకోవడం.. పౌరుల ప్రాణాలు కాపాడటం" అనే అంశంపై శుక్రవారం ఐక్యరాజ్యసమితిలో చర్చ నిర్వహించారు. ఈ సందర్భంగా పాకిస్థాన్ మరోసారి తప్పుడు ప్రచారానికి దిగింది. ఐరాసలో భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ దీనిని తీవ్రంగా అడ్డుకున్నారు. సింధూజల ఒప్పందాన్ని భారత్ నిలిపివేయడానికి కారణాలను సమావేశానికి తెలిపారు. "భారత్‌పై మూడుసార్లు యుద్ధానికి దిగి, వేలసార్లు ఉగ్రవాదుల్ని ఎగదోసి ఒప్పంద స్ఫూర్తిని పాకిస్థాన్ ఉల్లంఘించింది. గడిచిన నాలుగు దశాబ్దాల్లో ఉగ్రదాడుల కారణంగా భారత్‌లో 20వేల మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. అయినా మేం సహనంతో ఉన్నాం. పాక్ సీమాంతర ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తూ, భారత్‌లోని పౌరుల జీవితాలను, మత సామరస్యాన్ని, ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయాలని చూస్తోంది. గత రెండేళ్లుగా ఒప్పందంలో సవరణలు చేయాలని పాక్‌ను భారత్ కోరింది. దాయాది దేశం తిరస్కరించింది. పహల్గాం ఉగ్రదాడి తర్వాత మేం సహనం కోల్పోయాం. వీటన్నింటినీ సహించలేకే సింధు జలాల ఒప్పందాన్ని రద్దు చేశాం. ఉగ్రవాదానికి ఆ దేశం మద్దతునివ్వడం నిలిపివేసేవరకు ఇది కొనసాగుతుంది" అని హరీశ్ స్పష్టంచేశారు. ఇదే విషయమై పార్లమెంటరీ కమిటీలో విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి విక్రం మిస్రీ మాట్లాడారు. పాకిస్థాన్ నుంచి స్నేహ హస్తం అందకపోవడంతో సింధూ జలాల ఒప్పందం నిలిపివేయాల్సి వచ్చిందని అన్నారు. పహల్గాం ఉగ్ర ఘటన సహా క్షేత్రస్థాయిలో ఎన్నో అంశాలు ఇందుకు కారణమయ్యాయని తెలిపారు.

# మోదీ హిమాలయ పర్వతాల వంటివారు.. ఎవరికీ తల వంచరు

తలవంచరని ఆయన ప్రశంసించారు. ఢిల్లీలో జరిగిన ఎన్డీఏ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రుల సమావేశంలో పవన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పలు కీలక వ్యాఖ్యలు చేశారు.దేశ ప్రగతికి ప్రధాని మోదీ ఇస్తున్న ప్రాధాన్యతకు 'పీఎం-జన్ మన్' కార్యక్రమమే నిదర్శనమని పవన్ తెలిపారు. "ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎప్పుడూ ఓట్ల గురించి ఆలోచించరు. దేశాభివృద్ధే లక్ష్యంగా ఆయన తన కర్తవ్యాన్ని నిర్వర్తిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం నిధులు సమకూరుస్తున్న ఈ కార్యక్రమం ద్వారా అత్యంత వెనుకబడిన గిరిజన సమూహాలు (పీవీటీజీ) నివసించే ఆవాసాలకు రహదారి సౌకర్యం కల్పించగలుగుతున్నాం" అని ఆయన వివరించారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో "పీఎం-జన్ మన్" పథకం అమలు తీరును వివరిస్తూ, "కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న రూ.555.61 కోట్ల నిధులతో రాష్ట్రంలో 612.72 కిలోమీటర్ల మేర రహదారులు నిర్మిస్తున్నాము. ఇవన్నీ పీవీటీజీ ఆవాసాలను కలిపే రోడ్లే. వీటి ద్వారా ఏడు జిల్లాల్లోని 239 పీవీటీజీ ఆవాసాలకు రోడ్డు మార్గాలు ఏర్పడుతున్నాయి. తద్వారా సుమారు 50 వేల మంది గిరిజనులకు రవాణా సౌకర్యం కలుగుతుంది" అని పవన్ పేర్కొన్నారు. ఓట్లు వస్తాయో లేదో అని చూడకుండా, ప్రతి ఒక్కరికీ, అన్ని ప్రాంతాలకూ అభివృద్ధి ఫలాలు అందాలన్నదే ప్రధాని సంకల్పమని ఆయన స్పష్టం చేశారు. ఈ స్ఫూర్తితోనే ఎన్డీఏ పాలిత రాష్ట్రాలు ముందుకు సాగుతున్నాయని తెలిపారు."ఆపరేషన్ సిందూర్" వంటి క్లిష్టమైన పరిస్థితుల్లో కూడా ప్రజల రక్షణతో పాటు వారి భవిష్యత్తు గురించి ప్రధాని మోదీ ఆలోచించారని, దేశ శక్తిసామర్థ్యాలను ప్రపంచానికి చాటి చెప్పిన ఘనత ఆయనదేనని పవన్ కల్యాణ్ కొనియాడారు.

కుల గణన ఆవశ్యకతను కూడా ఆయన నొక్కి చెప్పారు. "దేశంలో ఉన్న కులాల పరిస్థితులు, వారి జీవన విధానం, వృత్తులు, స్థితిగతులు తెలుసుకోవడానికి కుల గణన ఎంతో అవసరం. వారి జీవనోపాధిని మెరుగుపరచడానికి ఎలాంటి చర్యలు చేపట్టాలి, ఏ పథకాలు తీసుకురావాలో పాలకులకు స్పష్టత వస్తుంది" అని ఆయన అభిప్రాయపడ్డారు.అలాగే, ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని రాష్ట్ర కేబినెట్ ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలిపిందని పవన్ వెల్లడించారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి శ్రీ రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్ రాష్ట్రంలో మూడు నెలల పాటు పర్యటించి రూపొందించిన నివేదిక ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు.

# మళ్లీ పెరుగుతున్న కొవిడ్ కేసులు.. ఐసీఎంఆర్ చీఫ్ ఏమన్నారంటే?

ఎలాంటి ఇన్ఫెక్షన్ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

**రాష్ట్రాల వారీగా కొవిడ్ కేసులు ఇలా..**

దేశవ్యాప్తంగా క్రియాశీల కేసుల సంఖ్య 1009గా ఉండగా.. వారం వ్యవధిలో 750 మందికి కొత్తగా కరోనా సోకిందని సోమవారం కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. డేటాబోర్డులో వెల్లడించిన సమాచారం ప్రకారం.. ఈ ఉదయం 8గంటల వరకు రాష్ట్రాల వారీగా కొవిడ్ యాక్టివ్ కేసుల వివరాలు పరిశీలిస్తే.. కేరళలో అత్యధికంగా 430 క్రియాశీల కేసులు ఉండగా.. మహారాష్ట్ర (209), దిల్లీ (104), గుజరాత్ (83), తమిళనాడు (69), కర్ణాటక (47), ఉత్తరప్రదేశ్ (15), రాజస్థాన్ (13), పశ్చిమబెంగాల్ 12, పుదుచ్చేరి 9, హరియాణా 9, ఏపీ 4, మధ్యప్రదేశ్ 2, తెలంగాణ, గోవా, ఛత్తీస్‌గఢ్‌లలో ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయి.

# ఉత్తమ పాలన విధానాలతోనే వికసిత భారత్

ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులు

**ఆత్మవిశ్వాసాన్ని పెంచిన ఆపరేషన్ సిందూర్**

'ఆపరేషన్ సిందూర్' వల్ల భారతీయుల్లో ఆత్మవిశ్వాసం ఇనుమడించిందని పేర్కొంటూ ఈ సమావేశం ఒక తీర్మానాన్ని ఆమోదించింది. ఉగ్రవాదులకు బుద్ధిచెప్పడంలో ప్రధాని మోదీ సాహసోపేత నాయకత్వాన్ని కనపరిచారని కొనియాడింది. రాజస్థాన్ సీఎం భజన్‌లాల్ శర్మ ఈ మేరకు ప్రవేశపెట్టిన తీర్మానం ఆమోదం పొందింది. సైనిక దళాలకు మోదీ అన్నివేళలా మద్దతుగా నిలుస్తున్నారని పేర్కొంది. ఉగ్రవాదులకు, వారి ప్రాయోజకులకు భారత సైన్యం దీటైన సమాధానం ఇచ్చిందని కొనియాడింది. సమావేశంలో ప్రధానితో పాటు కేంద్ర మంత్రులు అమిత్‌షా, రాజ్‌నాథ్ సింగ్, జె.పి.నడ్డా తదితరులు పాల్గొన్నారు. కుప్పంలో నూతన గృహప్రవేశ కార్యక్రమం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ సమావేశానికి రాలేకపోయారు. ఆయన మినహా 20 మంది సీఎంలు, 18 మంది డిప్యూటీ సీఎంలు హాజరయ్యారు. పహల్గాం దాడిలో ప్రాణాలు కోల్పోయినవారికి సమావేశం నివాళులర్పించింది. దేశవ్యాప్తంగా కులగణనను చేపట్టాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రశంసిస్తూ మరో తీర్మానాన్ని ఈ సమావేశం ఆమోదించింది. పాల్గొన్న ముఖ్యమంత్రుల్లో హిమంత బిశ్వశర్మ (అస్సాం), యోగి ఆదిత్యనాథ్ (యూపీ), రేఖా గుప్తా (దిల్లీ), దేవేంద్ర ఫడణవీస్ (మహారాష్ట్ర), నీతీశ్ కుమార్ (బిహార్), భజన్‌లాల్ శర్మ (రాజస్థాన్), నెఫ్యూ రియో (నాగాలాండ్), కాన్రాడ్ సంగ్మా (మేఘాలయ), మాణిక్ సాహా (త్రిపుర), పెమా ఖండూ (అరుణాచల్‌ప్రదేశ్), మోహన్‌చరణ మాఝి (ఒడిశా), నాయబ్ సింగ్ సైనీ (హరియాణా), పుష్కర్ సింగ్ ధామీ (ఉత్తరాఖండ్), ప్రమోద్ సావంత్ (గోవా), మోహన్ యాదవ్ (మధ్యప్రదేశ్), భూపేంద్ర పటేల్ (గుజరాత్) తదితరులు ఉన్నారు.

**ఆ అనుభవాలు వినడం అద్భుతంగా ఉంది: మోదీ**

సమావేశం ముగిసిన అనంతరం ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. సీఎంలతో కలిసి తీసుకున్న ఫొటోను, చర్చించిన అంశాల సారాంశాన్ని 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు. "అనేక అంశాలపై సుదీర్ఘంగా చర్చించాం. నీటి సంరక్షణ, ఫిర్యాదుల పరిష్కారం, పరిపాలన వ్యవస్థల్ని బలోపేతం చేయడం, విద్య, మహిళా సాధికారత, క్రీడలు, విభిన్న రంగాల్లో ఉత్తమ పద్ధతులను ఆయా రాష్ట్రాలు ప్రదర్శించాయి. ఈ అనుభవాలను వినడం చాలా అద్భుతంగా ఉంది" అని తెలిపారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలు చేపట్టే పథకాలు ప్రజలకు సమర్థవంతంగా చేరేలా చూడాలని సూచించారు. పారిశుద్ధ్యం, ఆరోగ్య సంరక్షణ, యువత సాధికారత, వ్యవసాయం, సాంకేతికత వంటి కీలక రంగాల్లో బలమైన వ్యవస్థను నిర్మించడంపై ఈ సమావేశంలో మాట్లాడినట్లు పేర్కొన్నారు.

# వైఎస్సార్ జిల్లా పేరు మారింది.. జీవో జారీ చేసిన ఏపీ ప్రభుత్వం

వెల్లువెత్తాయి.గతంలో, చంద్రబాబు ప్రతిపక్ష నేత హోదాలో జిల్లాలో పర్యటించిన సందర్భంలో, తాము అధికారంలోకి వస్తే జిల్లా పేరును పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. తాజాగా, రాష్ట్ర మంత్రి సత్యకుమార్ కూడా ఈ అంశంపై ముఖ్యమంత్రికి లేఖ రాశారు. పేర్ల మార్పుపై మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని, 'కడప' అనే పదాన్ని తొలగించి కేవలం వైఎస్సార్ జిల్లాగా మార్చడాన్ని ఆయన తప్పుబట్టారు.ప్రజల నుంచి కూడా ఈ విషయమై పలు విజ్ఞప్తులు అందడంతో, రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ జిల్లా పేరును తిరిగి 'వైఎస్సార్ కడప జిల్లా'గా మార్చాలనే స్పష్టమైన అభిప్రాయానికి వచ్చింది. ఈ నేపథ్యంలోనే మంత్రివర్గ ఆమోదం అనంతరం తాజాగా అధికారిక ఉత్తర్వులు జారీ అయ్యాయి.

# పోలేరమ్మ తల్లి దేవాలయంలో చోరీ





**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, మే 26)**

నాగిరెడ్డిపాలెం గ్రామంలోని శ్రీ పోలేరమ్మ తల్లి దేవస్థానంలో ఆదివారం రాత్రి గుర్తుతెలియని దొంగలు పడి హుండీలోని రూ.10 వేల నగదు, గర్భగుడిలో సుమారు 40 వేల రూపాయలు ఆభరణాలను దొంగలించుకుని పోయినట్లుగా నాగిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన గడ్డం శ్రీనివాసరావు సోమవారం పొన్నలూరు ఎస్ఐ కె అనూక్‌కి ఫిర్యాదు చేశారు. వెంటనే కేసు నమోదు చేసి సంఘటన స్థలానికి క్లూస్ టీం, డాగ్స్ స్క్వాడ్ లను పిలిపించి నేర స్థలంలో వేలిముద్రలు తీయించి నేరస్తుల కోసం సీసీ ఫుటేజ్ పరిశీలన , నేరస్తుల కోసం వారి సిబ్బందిని ప్రత్యేక బృందాలుగా తయారు చేసి గాలిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రయాణికుల భద్రతే ఆర్టీసీ లక్ష్యం డిపో మేనేజర్





**(షణ్ముఖ వెలుగు, కనిగిరి, మే 26)**

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులందరికీ సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణం కల్పించడమే ఆర్టీసీ లక్ష్యమని డిపో మేనేజర్ మహమ్మద్ సయనా బేగం అన్నారు. సోమవారం ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు ఆమె కనిగిరి పామూరు రూట్‌లో బస్సుల తనిఖీ నిర్వహించారు. బస్సులు, సిబ్బంది పనితీరును తనిఖీ చేసి,ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. బస్సులో ప్రయాణించే సమయంలో ఏదైనా సమస్య వస్తే ఆర్టీసీ సిబ్బందికి తెలియజేయవచ్చుని సిబ్బంది వెంటనే సహాయం అందిస్తారని ప్రయాణికులకు తెలిపారు. ఈ సందర్భంగా వంగపాడు అడ్డ రోడ్డు సెంటర్ లో ఓవర్ లోడ్‌తో వస్తున్న ఆటోలను తనిఖీ చేసి వాటిలో ప్రయాణం చేస్తున్న ప్రయాణికులకు భద్రత గురించి తెలియపరచి వారిని బస్సులో వెళ్లే విధంగా చేశారు. ఈ తనిఖీలు బస్సు మార్గాల్లో భద్రతను మెరుగుపరచడానికి, బస్సు ప్రయాణాలను మరింత సురక్షితంగా చేయడానికి సహాయ పడతాయన్నారు.

# మంత్రి కె పార్థసారథిని మర్యాదపూర్వకంగా కలిసిన కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి







**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, మే 26)**

కందుకూరు పట్టణంలోని కనిగిరి రోడ్డులో చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య నివాసంలో ఆదివారం రాత్రి రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి కె పార్థసారథిని చీరాల ఎమ్మెల్యే మద్దులూరి కొండయ్యతో కలిసి కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రిని ఎమ్మెల్యే ఇంటూరి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, నాదెళ్ల వెంకటరమణయ్య, మాదాల మాల్యాద్రి, ముప్పవరపు వేణు, ఇతర నేతలు పాల్గొన్నారు.

# జాతీయ సమైక్యత సదస్సులో విరివిగా పాల్గొనండి

## సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కె మాబు





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 26)**

జాతీయ సమైక్యతను కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్ కె మాబు సూచించారు. సోమవారం నాడు సుందరయ్య భవనంలో జరిగిన పార్టీ నగర కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. నగరకార్యదర్శి వర్గ సభ్యులు జి.రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాబు మాట్లాడుతూ గత నెల 22న జరిగిన పెహల్గం ఘటనను ప్రధాని మోడీ మత రాజకీయం చేస్తున్న వైనం జాతీయ సమైక్యతకు భంగం వాటిల్లేదిగా ఉందన్నారు. ఉగ్రవాదుల అణచివేత పేరున సాగిన పాకిస్తాన్ యుద్ధం అంశంలో, కాల్పుల విరమణ విషయంలో ఆపరేషన్ సింధూర్ అంశం లో ట్రంప్ జోక్యం విమర్శలకుతావిస్తుందన్నారు. ఉగ్రవాద చర్యలను మతాలకు అపాదించడం హెయమైన చర్యగా పేర్కొన్నారు. యుద్ధం వద్దు, శాంతి సామరస్యంతో పరిష్కారం చేసుకువాలని సూచించిన కమ్యూనిస్టులను శత్రువులుగా పరిగనిస్తున్నారని ఆరోపించారు.మోడీ ప్రభుత్వం ట్రంప్‌నే విశ్వ గురువుగా భావించి సలాం కొడుతున్నారు. ఆపరేషన్ సింధూర్ జయప్రదం అయిందని ప్రకటించాక కూడా కాల్పులు ఎందుకు జరిగాయి. ఉన్నట్లుండి ఎందుకు విరమించారన్న ప్రశ్నకు సంతృప్తికరమైన సమాధానం ఇవ్వడంలో భారత ప్రభుత్వం విఫలం అయిందన్నారు. కేవలం వాణిజ్య ప్రయోజనాల కోసమే కాల్పుల విరమణ చేసినట్లు ట్రంప్ తాజాగా ప్రకటించారని, మొత్తం ఈ ఘటనను పార్లమెంటు సమావేశం జరిపి మోడీ వాస్తవాలను ప్రజలకు ప్రకటన చేయాలని సిపిఎం డిమాండ్ చేస్తున్నదని పేర్కొన్నారు. తెలుగుదేశం ఎన్డీఏ భాగస్వామిగా బిజెపి మతోన్మాదానికి వంత పాడుతున్నది .తిరంగా యాత్ర పేరుతో బిజెపి పిలుపునిస్తే రాష్ట్రంలో, అధికారులు అధికారిక కార్యక్రమంగా మార్చి లౌకిక శక్తులను ఎవరిని కలుపుకోకుండా ప్రజల్లో మతోన్మాదాలకు ఆదరణ కల్పిస్తున్నదని ఆరోపించారు. మోడీకి తలొగ్గిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మాట్లాడటం లేదు .తెలుగుదేశం, వైఎస్ఆర్సిపి, జనసేన పార్టీలోని లౌకిక ప్రజా తంత్ర శక్తులు మతోన్మాదానికి వ్యతిరేకంగా మతసామరస్యం, దేశ సమైక్యత, రాజ్యాంగ పరిరక్షణ కోసం ముందుకు రావాలని సిపిఎం పిలుపునిస్తున్నది. ఈ నేపథ్యంలో జరుగుతున్న ఈ సదస్సు జూన్ 1 ఆదివారం సాయంత్రం 5 గంటలకు సుందరయ్య భవన ఆవరణలో జరుగుతున్నది. పిడిఎఫ్ మాజీ ఫ్లోర్ లీడర్ కే ఎస్ లక్ష్మణరావు ముఖ్యఅతిథిగా పాల్గొంటున్నారు. మధ్యతరగతి అభ్యుదయ శక్తులు లౌకికవాదులు మతసామరస్యాన్ని కోరుకునేవారు. వివిధ తరగతుల ప్రజానీకం అందరు కూడా పాల్గొని విజయవంతం చేయవలసిందిగా ఆయన పిలుపునిచ్చారు. పార్టీ నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ నగరంలో స్వచ్ఛమైన రక్షిత మంచినీరు సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే స్మార్ట్ మీటర్ల బిగింపును తక్షణమే ఆపివేయాలని డిమాండ్ చేశారు. అర్హుల పేదలకు రెండు సెంట్లు ఇవ్వాలని అనర్హుల పేరుతో సుమారు పదివేల మందిని తొలగించడానికి ప్రయత్నం చేస్తున్నారని అర్హులైన ప్రతి పేదవాడికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. ఈ స్థానిక సమస్యల ఆందోళనకు ప్రజ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నగర కార్యదర్శి సభ్యులు తంబి శ్రీనివాసులు, నగర కమిటీ సభ్యులు బివి రావు, కే శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# చింతగుంపల్లిలో ప్రభుత్వ భూములను అర్హులైన స్థానిక పేదలకు పంపిణీ చేయాలి

## పీవీ శేషయ్య



**(షణ్ముఖ వెలుగు, కనిగిరి, మే 26)**

చింతగుంపల్లి నందలి ప్రభుత్వ భూములను అర్హులైన స్థానిక పేదలకు పంపిణీ చేయాలని పీసీపల్లె తహశీల్దార్‌ను కలిసి సిపి ఎం జిల్లా నాయకులు పివి శేషయ్య కోరారు. పీసీ పల్లి మండలం చింతగుంపల్లె రెవెన్యూలో 24 మంది గ్రామ పెత్తందారులు అప్పటి స్థానిక రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై, సర్వేనెంబర్ 1 అడవి పోరంబోకు, సర్వేనెంబర్ 11 వాగుపోరంబోకులో మొత్తం 822 ఎకరాలకు ఫోర్జరీ పట్టాలు, పాస్ పుస్తకాలు తప్పుడు పద్ధతిలో పొంది ఉన్నారు. అప్పటి ఎమ్మార్వో కృష్ణయ్య , సదరు బోగస్ పట్టాలు, పాస్ పుస్తకాలను గుర్తించి వెంటనే జిల్లా కలెక్టర్‌కి ఫిర్యాదు చేశారు. అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో 2002, 2003లో సదరు అక్రమ పట్టాల రద్దుకై, భూమిలేని నిరుపేదలకు సదరు భూమిని పంపిణీ చేయాలని కోరుతూ అనేక ఆందోళనలు నిర్వహించడం జరిగినది. 2003 జనవరిలో చింతగుంపల్లెలో జరిగిన జన్మభూమి సభలో పేదలు పెద్ద ఎత్తున పాల్గొని అక్రమ పట్టాల రద్దును కోరుతూ ఆందోళన చేశారు. ఈ సందర్భంగా పెత్తందారులు పేదలపై దాడికి పాల్పడటం కూడా జరిగింది. ఈ కార్యక్రమంలో అప్పటి జిల్లా పరిషత్ చైర్మన్ ముక్కు కాశిరెడ్డి, అప్పటి ఎమ్మార్వో గ్లోరియా ఇద్దరు ప్రత్యక్ష సాక్షులుగా ఉన్నారు. చట్టాన్ని ఉల్లంఘించి అక్రమంగా పట్టాలు, పాస్ పుస్తకాలను పొంది, భూమిలోకి ఆక్రమంగా ప్రవేశించిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని పోలీస్ వారికి అప్పటి ఎమ్మార్వో ఆనందరామ్ 23.3.2006 న ఆదేశించారు. అనంతరం దీనిపై ప్రభుత్వం సీరియస్ గానే స్పందించింది. ఈ అక్రమాలపై విచారణ జరిపిన అనంతరం 17.6.2009న సదరు పట్టాలను, పాస్ పుస్తకాలను ప్రభుత్వం రద్దుచేసి భూమిని స్వాధీనం చేసుకోవడం జరిగింది.చింతగుంపల్లి రెవెన్యూ గ్రామములో సెంటు భూమిలేని నిరుపేదలు గణనీయమైన సంఖ్యలో ఉన్నారు. వీరందరినీ గుర్తించి అర్హులైన పేదలందరికీ సదరు భూమిని పంపిణీ చేయవలసిందిగా స్థానిక పేదలు వినతి పత్రంను ఈ రోజు పి సి పల్లె తహశీల్దార్‌కి అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో చుండి చిన కోటయ్య,గుంటగాని చిన గంగయ్య, ఎ.యిర్మీయా పాల్గొన్నారు.

షణ్ముఖ
వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
ప్రకాశం

# పొగాకు రైతులకు గట్టి భరోసా

**ప్రజల్లోకి వెళ్లిన ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి**

**పొదిలిలో రైతులతో మమేకమై సమస్యలపై చర్చ**

**రైతాంగానికి ప్రభుత్వ సహాయం హామీ**



**(షణ్ముఖ వెలుగు బ్యూరో, ప్రకాశం, మే 26)**

ప్రకాశం జిల్లా వ్యవసాయ రంగానికి చక్కటి గుర్తింపుగా నిలిచిన పొగాకు సాగు ఇటీవల ధరల పతనంతో తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ప్రజాప్రతినిధిగా మాత్రమే కాకుండా రైతుల మనసు తెలిసిన వ్యక్తిగా పొదిలిలోని పొగాకు మార్కెట్ యార్డును సోమవారం సందర్శించారు. రైతులతో ప్రత్యక్షంగా మమేకమయ్యారు. వ్యవసాయ రంగానికి అండగా నిలిచే సంకల్పంతో సమస్యలని దగ్గరగా తెలుసుకునేందుకు ఆయన తీసుకున్న ఈ చర్య రైతాంగానికి కొత్త ఉత్సాహాన్ని తెచ్చింది.

**రైతుల మన్ననలు పొందిన నేత :** రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను చెవిపెట్టుకొని, వారి భావోద్వేగాలను పంచుకున్న కందుల నారాయణరెడ్డి పొగాకు సాగుకు పెట్టుబడి ఎంత అయిందో, దిగుబడి ఎలా ఉందో, మార్కెట్ ధరల కారణంగా వారు ఎదుర్కొంటున్న లాభనష్టాలను విశ్లేషించుకున్నారు. రైతుల మాటలు సూటిగా వినేందుకు, వారికి భరోసా కలిగించేలా మాట్లాడేందుకు కందుల నారాయణరెడ్డి కనబరిచిన ఆదరణ రైతుల హృదయాలను గెలుచుకుంది. పొగాకు సాగు రైతుల ఆత్మగౌరవాన్ని కాపాడాలన్న తపన ఆయన మాటల్లో స్పష్టంగా కనిపించింది.

**ప్రభుత్వం భరోసా కలిగిస్తుందన్న హామీ :** ఈ సందర్భంగా మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులకు వెన్నెముకగా నిలుస్తుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యవసాయ రంగానికి ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నారు. రైతుల ప్రయోజనాల కోసం అవసరమైన ప్రతీచర్య తీసుకుంటామన్నారు. మద్దతు ధరపై భరోసా కలిగిస్తూ, రైతులు నష్టపోకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టేలా ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేస్తుందని ఆయన తెలిపారు.

**టుబాకో బోర్డు ద్వారా నేరుగా కొనుగోళ్లు :** పొగాకు రైతులకు కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని మాట్లాడిన ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి టబాకో బోర్డు ద్వారా ప్రభుత్వం నేరుగా కొనుగోళ్లు చేపట్టేలా చూస్తోంది అని ప్రకటించారు. ఈ ప్రక్రియ అమలులోకి వస్తే రైతులు ధరలపై ఆందోళన పడాల్సిన అవసరం లేకుండా పోతుందని, మార్కెట్ ఆధారిత అనిశ్చితి తొలగి స్థిరమైన ఆదాయం వచ్చే మార్గం సుస్పష్టమవుతుందని వివరించారు. ఇప్పుడే కాకుండా భవిష్యత్తులోనూ పొగాకు రైతులకు దీర్ఘకాలిక భరోసా ఇచ్చే విధంగా ప్రభుత్వ విధానాలు అమలవుతాయని చెప్పారు. రైతులు అధైర్య పడకుండా ఉండాలని సూచించారు.

**రైతాంగానికి నూతన ఆశలు :** ఈ పరిణామం ప్రకాశం జిల్లా మొత్తం పొగాకు రైతుల్లో కొత్త విశ్వాసాన్ని కలిస్తోంది. ప్రభుత్వ పెద్దలు, ప్రజాప్రతినిధులు ఇలా నేరుగా రైతుల్లోకి వెళ్లి వారి గుండె చప్పుడిని తెలుసుకోవడం, అదే సమయంలో ఆ సమస్యలకు ప్రత్యామ్నాయాలను సమర్పించడం రైతులకు నూతన భరోసాను కలిగిస్తోంది. ఈ భరోసా మాటలు కేవలం రాజకీయ ప్రకటనలకే పరిమితం కాకుండా, అవి కార్యరూపంలోకి వస్తే రైతుల జీవితాల్లో నిజమైన వెలుగులు పులుముతాయని వ్యవసాయ రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఇతర రాష్ట్రాలకు కూడా ఆదర్శంగా నిలిచేలా చేస్తున్నాయి.

**రైతులకు సందేశం :** ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి రైతులకు సూచిస్తూ మీరు చేసిన కష్టం వృథా కాదు. ప్రభుత్వం మీతో ఉంది. ధైర్యంగా ముందుకు సాగండి.

ప్రతి రైతు జీవితంలో వెలుగులు నింపే బాధ్యతను మేము తీసుకుంటామని ధైర్యం నూరి పోశారు. మొత్తంగా కందుల నారాయణరెడ్డి ప్రజల్లోకి వెళ్లి రైతులకు మద్దతుగా నిలిచిన తీరుతో ప్రజలలో విశ్వాసం పెరిగింది. ఇది కేవలం ఒక నాయకుడి ప్రయత్నంగా కాక రైతుల కోసం ప్రభుత్వ కృషికి ప్రాథమిక అడుగుగా నిలిచింది. ఇలాంటి చొరవలే రైతాంగాన్ని నిలబెట్టగలవని ప్రతి ఒక్కరూ విశ్వసిస్తున్నారు.



# ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకం అమలులో స్వయం సహాయక గ్రూపులకు బ్యాంకు రుణాలు మంజూరు చేయాలి

**జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి**

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, మే 26)**

ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన పథకము అమలులో స్వయం సహాయక గ్రూపులకు బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి బ్యాంకర్లకు సూచించారు. సోమవారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ బ్యాంకులతో సమీక్ష నిర్వహించారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన లక్ష్యాలను పూర్తి చేయుటకు బ్యాంకులు రుణాలు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. దిగువ, మధ్య తరగతి నివాస వినియోగదారుల ప్రయోజనం కోసం ఈ పథకమును 13 ఫిబ్రవరి 2024 న భారత ప్రధాని ప్రవేశ పెట్టారని ఆయన తెలిపారు. ఈ పథకం కింద దేశవ్యాప్తంగా 75 వేల 021 కోట్ల రూపాయలు నిధులు కేటాయించారని ఆయన తెలిపారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు 2 కిలో వాట్స్ చొప్పున ఉచితంగా సోలార్ సిస్టం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. వీరి ఇంటిపై సోలార్ సిస్టం ఏర్పాటుకు సంబంధించి స్థలం ఇచ్చినందుకు వారికి గవర్నమెంట్ కొంత మొత్తం చెల్లిస్తుందని ఆయన తెలిపారు. ఈ పథకాన్ని రాష్ట్ర మొత్తం అమలు చేయుటకు ముఖ్యమంత్రి

4

# మద్యం స్కాం నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే జగన్ పర్యటన

**(షణ్ముఖ వెలుగు, పొదిలి, మే 26)**

ఈ నెల 28న పొదిలిలో జగన్ పర్యటన నేపథ్యంలో రాజకీయాలు ఒక్క సారిగా వేడక్కాయి. జగన్ పర్యటన ఖరారు కావడంతో ప్రభుత్వనికి వణుకు పుట్టి అప్పటికిప్పుడు పొగాకు రైతుల మీద ప్రేమ ఒలక బోస్తున్నరని వైసిపి ఆరోపిస్తుండగా, తాము ఎవ్వరికి అదరం, బెదరం. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పొదిలి పొగాకు వేలం కేంద్రాన్ని సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం వేలం ప్రక్రియ ముగిసేంతవరకు పొదిలి బోర్డులోనే ఉండి బయ్యర్లతో కలిసి పొగాకు కొనుగోలు ప్రక్రియను స్వయంగా పర్యవేక్షించారు. దాదాపు ఐదు గంటల పాటు పొదిలి బోర్డులోనే ఉండి స్వయంగా రైతులకు లాభం చేకూర్చే విధంగా దాదాపు ప్రతి బేలు కొనుగోలు అయ్యేటట్లు చేశారు. పొగాకు కంపెనీల యజమాన్యలను ఒప్పించి, మెప్పించి రైతులకు అన్యాయం జరగకుండా కాపాడుకుంటామన్నారు. రైతుల పట్ల నిజమైన చిత్తశుద్ధి తమకే ఉందంటు పొదిలి పొగాకు బోర్డు వద్ద సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మార్కాపురం ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ సీజన్ కు 11 మిలియన్ల పొగాకు ఉత్పత్తికి పొగాకు అనుమతిస్తే రైతులు దాదాపు 18 మిలియన్ల పొగాకును పండించారని అన్నారు. బయర్లు ఈ సీజన్‌కు లో గ్రేడ్ పొగాకును కొనడానికి కొంత ఆసక్తి చూపించలేదని, ఈ నెల 20వ తేదీన 14 బేళ్ళు, 21న 15 బేళ్లు, 22న 17 బేళ్ల మాత్రమే కొనుగోలు చేశారని తరువాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో తాను వచ్చి కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి ఒప్పించి, మెప్పించి 24న 72 బేళ్లు, సోమవారం నాడు 133 బెళ్ళు లోగ్రేడ్ పొగాకును కొనుగోలు చేయించామన్నారు. అదే రకంగా అన్ని కంపెనీలు ఈ నెల 20న 720 బేళ్లు, 21న 840 బేళ్లు, 22న 684 బేళ్లు, 23న 1000 బేళ్లు, 24న 1090 బేళ్లు, సోమవారం రోజున 1100 బేళ్లు అన్ని రకాల పొగాకు కంపెనీ ప్రతినిధులు కొనుగోలు చేశారన్నారు. ఓ పద్ధతి ప్రకారం కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి వారిని ఒప్పించి మెప్పించి గ్రాద్యువల్‌గా కొనుగోళ్ళను పెంచుతున్నామని అన్నారు. ఏదో ఇక్కడ జరిగిపోతున్నట్టు ఎల్లుండి వైసిపి నాయకులు పర్యటన చేయబోతున్నారని గత ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం కుంభకోణాన్ని డైవర్ట్ చేసేందుకు జగన్‌రెడ్డి పొదిలికి వస్తున్నారని డైవర్ట్ పాలిటిక్స్ వైసీపీకి వెన్నతో పెట్టిన విద్య అని అన్నారు.

- రైతులు పండించిన చివరి పంట వరకు కొనుగోలు చేయిస్తాం
- నేటి నుంచి లోగ్రేడ్ పొగాకు కూడా కొనుగోలు ప్రారంభం
- గత ప్రభుత్వ ప్రతినిధుల దెబ్బకి కంపెనీలు దేశం విడిచి పారిపొయ్యాయి
- బోర్డు పరిధిలో 11 మిలియన్లు పండించాల్సి ఉండగా 18 మిలయన్ల పంట పండించారు
- అయిన చివరి క్వింటావరకు కొనుగొలు చేయిస్తాం
- రైతులు అధైర్య పడవద్దు వారికి అండగా ఉంటాం
- మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

రైతులు దిగులు చెందవలసిన అవసరం లేదని, ప్రతి పొగాకు బేలును కొనుగోలు చేసే విధంగా చర్యలు చేపడతామని ఎటువంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని అన్నారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో మద్యం కుంభకోణం, మట్టి మాఫియా, ఇసుక మాఫియా లు రాష్ట్రాన్ని పట్టిపీడించారని ఇప్పుడు ఒక్కొక్కటి బయటికి వస్తున్నాయని అన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ ఇన్ని రోజులు ఈ వైసీపీ నాయకులు ఎక్కడికి పోయారన్నారు. తమ శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి విచ్చేసి ప్రతి పొగాకు బేలు కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకున్నారని ఆనందం వ్యక్తం చేశారు. మమ్ములను చుసి చుచ్చు పొసుకుంటున్నారని వారి ఛానళ్ళలో చెపుతున్నారు. ఇప్పుడు ఎవ్వరు చుచ్చు పొసుకుంటున్నారో ప్రజలు చుస్తున్నారన్నారు. ఎంతమంది చిప్పకుడు తింటున్నారో, మిమ్మలను నమ్ముకున్న వారు ఏ పరిస్థితిలలో ఉన్నారో ప్రజలకు తెలుస్తుందన్నారు. సంవత్సరానికే తట్టుకొలేక పొతే ఇక 10 ఏళ్ళు మా ప్రభుత్వం ఉంటే గుండెలు ఆగిపొయాల ఉన్నాయన్నారు. ఇప్పుడే ఏముంది, ముందుంది మొసళ్ళ పండుగ అన్నారు. మద్యం స్కాం, బియ్యం స్కాం అన్ని బైటికి వస్తాయన్నారు. తాము కమాండ్ చేయ్యం,

4



# రక్తసంబంధీకులే మోసం చేశారు



**తన స్థలాన్ని తనకు ఇప్పించాలి**
**కలెక్టరేట్లో పురుగుల మందు తాగిన బాధితురాలు**
**స్పందించిన అధికారులు, రిమ్స్‌కు తరలింపు**

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 26)**

రక్తసంబంధికులే తనను మోసం చేశారని, తన స్థలాన్ని తనకు (తరువాయి 4లో...)

# బ్లాక్ బర్లీ పొగాకు పంటను కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలి

**జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి**



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, మే 26)**

బ్లాక్ బర్లీ పొగాకు పంటను కంపెనీలు వేగంగా కొనుగోలు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. సంక్షేమ పథకాల అమలు తీరు, అభివృద్ధి కార్యక్రమాలపై సోమవారం స్థానిక పిజిఆర్ఎస్ హాలులో జిల్లా అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. పొగాకు కొనుగోలులో సమస్యల పరిష్కారం కోసం పర్చూరులో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పొగాకు రైతుల కొరకు టోల్ ఫ్రీ నెంబర్ అందుబాటులోకి తీసుకురావాలన్నారు. బ్లాక్ బర్లీ పొగాకు సంక్షోభంలో ఉన్నందున ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. పొగాకు కొనుగోలుపై ప్రజా ప్రతినిధుల పర్యవేక్షణ ఉంటుందని, అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పొగాకు కొనుగోలు తర్వాత పంట నిల్వ చేయడానికి అవసరమైన గోదాములు గుర్తించి, సిద్ధంగా ఉంచాలన్నారు. పొగాకు కొనుగోలు ముగిసే వరకు పొగాకు కంపెనీల ప్రతినిధులు, సంబంధిత అధికారులతో వీడియో, టెలి కాన్ఫరెన్స్ లు నిరంతరాయంగా నిర్వహిస్తామన్నారు. మంత్రి సమక్షంలో జరిగిన ఒప్పందాల మేరకు పొగాకు కొనుగోలులు జరగాలన్నారు. అలాగే ధాన్యం సేకరణ వేగం పంజుకునేలా (తరువాయి 4లో...)

# మద్యం స్కాం నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే జగన్ పర్యటన

డిమాండ్ చేయ్యం... కంపెని ప్రతినిధులను మెప్పిస్తాం, రైతులను సంతృప్తి పరుస్తామన్నారు. రైతులు ఎంత పండీచారో చివరి క్వింటా వరకు కొనుగొలు చేయిస్తామన్నారు. గత ప్రభుత్వ ప్రతినిధుల దెబ్బకి చాలా కంపెనీలు దేశం విడిచి పారిపోయాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మీగడ ఓబుల్‌రెడ్డి, ముల్లా ఖుద్దూస్, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి ఆవులూరి యలమంద, మాజీ జడ్పీటిసి సభ్యులు కాటూరి నారాయణబాబు, మాజీ సర్పంచ్ కాటూరి నారాయణ ప్రతాప్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కామసాని రామిరెడ్డి, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనిల్ (పండు), పొదిలి, మార్కాపురం ఎఎంసి ఛైర్మన్‌లు డాక్టర్ సయ్యద్ ఇమాంసా, మాలపాటి వెంకటరెడ్డి, మాదాలవారిపాలెం సొసైటీ ప్రెసిడెంట్ యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, శివాలయం ట్రస్టు బోర్డు ప్రతిపాదిత ఛైర్మన్ ఒగ్గు వెంకట రామయ్య, మాజీ శివాలయం ట్రస్టు బోర్డు అధ్యక్షులు సామంతపూడి నాగేశ్వరరావు, మెడికల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ స్వర్ణ గీత, ముస్లిం మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు షేక్ రసూల్ మహమ్మద్, మండల తెలుగు యువత అధ్యక్షులు పోపూరి నరేష్‌బాబు, కొనకనమిట్ల మండల పార్టీ అధ్యక్షులు మూరబోయిన బాబురావు యాదవ్, గొట్లగట్టు సర్పంచ్ పెరికె సుఖదేవ్ (బూన్), మాజీ మండల పార్టీ అధ్యక్షులు తాతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ముువ్వ కాటం రాజు, ఏ



అంజిరెడ్డి, రాజు, ముని శ్రీనివాసులు, తానికొండ వెంకట్రావు, సానికొమ్ము వెంకటేశ్వరరెడ్డి (వైస్), లీగల్ సెల్ జిల్లా కార్యదర్శి షేక్ షబ్బీర్, తెలుగుదేశం పార్టీ నాయకులు, రైతులు, రైతు నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.







# రక్తసంబంధీకులే మోసం చేశారు





ఇప్పించాలంటూ సౌభాగ్యమ్మ కలెక్టర్ కార్యాలయంలోని గ్రీవెన్స్ వద్దకు పురుగుల మందు తాగి వచ్చారు. పరిస్థితిని గమనించిన అధికారులు స్పందించి, సౌభాగ్యమ్మను చికిత్స నిమిత్తం వెంటనే ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. జిల్లాలోని త్రిపురాంతకం మండలం, గ్రామానికి చెందిన ఎరుకల కులానికి సంబంధించిన పేరం సౌభాగ్యమ్మ తన రక్త సంబంధీకులు అన్యాయం చేశారని, తన స్థలాన్ని అక్రమంగా రాయించుకున్నారని, తనకు న్యాయం చేయాలంటూ పలుమార్లు జిల్లా ఉన్నతాధికారి చుట్టూ తిరిగాయి. అధికారులు స్పందించడం లేదంటూ గతంలో రెండు పర్యాయాలు పురుగుల మందు తాగారు. ఒకసారి ఎస్పీ కార్యాలయం వద్ద, మరో మారు కలెక్టర్ కార్యాలయం వద్ద పురుగుల మందు తాగారు. తాజాగా సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా అధికారులు నిర్వహిస్తున్న గ్రీవెన్స్ లో సౌభాగ్యమ్మ పురుగులు మందు తాగి అధికారుల వద్దకు విచ్చేశారు. సౌభాగ్యమ్మ పరిస్థితిని గమనించిన అధికారులు స్పందించి వెంటనే మెరుగైన చికిత్స కోసం రిమ్స్‌కు తరలించారు.

# ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకం అమలులో స్వయం సహాయక గ్రూపులకు బ్యాంకు రుణాలు మంజూరు చేయాలి



లక్ష్యాలను నిర్దేశించారని ఆయన తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో 10 వేల కుటుంబాలకు సోలార్ సిస్టం ఏర్పాటు చేయాలని నిర్దేశించారన్నారు. బాపట్ల జిల్లాకు 60 వేల కుటుంబాలకు సోలార్ సిస్టం ఏర్పాటు చేయుటకు నిర్దేశించారని ఆయన తెలిపారు. వీటిని 2027 సంవత్సరం నాటికి పూర్తి చేయాలని తెలిపారు. జిల్లాలో డిసెంబర్ నాటికి 47 వేల కనెక్షన్లు ఏర్పాటుకు లక్ష్యాలను నిర్దేశించడమైనదని తెలిపారు. జిల్లాలో ఈ లక్ష్యాలను చేరుకోవడానికి స్వయం సహాయక గ్రూపు సభ్యుల కుటుంబాలకు సోలార్ సిస్టం ఏర్పాటుకు చర్యలు తీసుకోవడమైనదని ఆయన అన్నారు. ప్రతి ఇంటికి 3 కిలో వాట్ సోలార్ ప్లేట్లు అమర్చుటకు నిర్ణయించడమైనదని ఆయన తెలిపారు. ఈ సోలార్ ప్లేట్ల అమర్చుటకు మొత్తం 2 లక్షల పదివేలు ఖర్చు అవుతుందని, అందులో 78 వేల రూపాయలు సబ్సిడీ కింద వస్తుందని, ఇందుకు లబ్ధిదారులు 20 వేలు చెల్లించాలని ఆయన తెలిపారు. ఇవి పోను బ్యాంకర్లు లోన్ కింద లక్ష 2 వేలు రుణం మంజూరు చేయాలన్నారు. ఈ పథకం కు సంబంధించి ఆన్లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ మొదలు పెట్టడం జరిగిందన్నారు. దరఖాస్తు దారులు చెల్లించవలసిన 20 వేల రూపాయలను చెల్లించుటకు చర్యలు తీసుకోవడమైనదని ఆయన తెలిపారు. ఆన్లైన్లో దరఖాస్తు వచ్చిన తరువాత వాటిని తిరస్కరించకుండా లోన్లు మంజూరు చేయాలని ఆయన బ్యాంకర్స్ కు సూచించారు. స్వయం సహాయక గ్రూపుల నుండి లోన్ రికవరీ మొత్తం చెల్లించే బాధ్యత మాదేనని ఆయన బ్యాంకులకు భరోసా ఇచ్చారు. లోన్ మంజూరు విషయంలో బ్యాంకు సిబ్బందికి సూచనలు చేయాలని ఆయన బ్యాంకర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె శ్రీనివాసరావు, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ ఆంజనేయులు, ఎల్‌డియం శివకృష్ణ, బ్యాంకు మేనేజర్లు, తదితరులు పాల్గొన్నారు.

# బ్లాక్ బర్లీ పొగాకు పంటను కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలి



అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటివరకు 33,200 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ జరగ్గా, ఇంకా 18 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాల్సి ఉందన్నారు. యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల 27వ తేదీన బాపట్లలోని భావపురి మందిరం ఎదురుగా ఉన్న ప్రధాన రహదారిపై జిల్లా స్థాయి కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ చెప్పారు. జిల్లా అధికారులు, వారి సిబ్బంది మొత్తం హాజరు కావాలన్నారు. అదే మాదిరిగా ఈనెల 31వ తేదీన సూర్యలంక సమీపంలోని అటవీ శాఖ నగర వనంలో భారీ స్థాయిలో యోగాసనాల కార్యక్రమం జరపాలన్నారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాల ద్వారా లబ్ధిదారులకు నేరుగా నగదు పంపిణీ చేసే కార్యక్రమంపై మాట్లాడారు. అవాంతరాలు ఏర్పడకుండా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలు, ధ్రువీకరణ పత్రాలు సేకరించాలన్నారు. ఐ వి ఆర్ యస్ ఫిర్యాదులపై అధికారులు తక్షణమే విచారణ జరపాలన్నారు. 16 రకాల ప్రభుత్వ సేవల గురించి ప్రజల స్పందనపై అధికారులు దృష్టి సారించాలన్నారు. జూన్ 22వ తేదీ తర్వాత గ్రామీణ ప్రాంతాలలోని రహదారుల వెంట చెత్త కనిపించరాదన్నారు. ప్లాస్టిక్ విక్రయాలు, వినియోగంపై ప్రజలకు విస్తృతమైన అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, ఉప కలెక్టర్ లవన్న, డిఆర్‌డిఏపిడి శ్రీనివాసరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# విశాఖ ఉక్కును ప్రైవేటీకరిస్తే ఊరుకోబోం

## హెచ్చరించిన కార్మిక నేతలు




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 26)

ఒంగోలు కలెక్టరేట్ వద్ద విశాఖ ఉక్కును రక్షించాలని కోరుతూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ నిరసన కార్యక్రమానికి సిఐటియు జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు, ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, ఏఐఆర్ఎఫ్‌టియు న్యూ జిల్లా కార్యదర్శి ఎమ్మెస్ సాయి కార్యక్రమానికి అధ్యక్షత వహించి నడిపారు. ఈ సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరు రంగారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విధానాలపైదుయ్యబెట్టారు. ఒకపక్క విశాఖ ఉక్కును ప్రైవేటీకరించబోమని చెబుతూనే దొడ్డి దారిన ప్రైవేటీకరించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. ఇటీవల కాలంలో నాలుగువేల మందిని కాంటాక్ట్ కార్మికులను తొలగించి మూడు నెలల నుంచివేతనాలు నిలిపివేశారు. జీతాలు రాకపోతే పని లేకపోతే ఫ్యాక్టరీ వదిలిపెట్టి వెళతారని కేంద్ర ప్రభుత్వం యొక్క ఆలోచన. 11 వేల కోట్లు తీసుకువచ్చి పరిశ్రమకు ఏమాత్రం ఉపయోగించకుండా బ్యాంకులకు అప్పులు చెల్లించారు. రెండో పక్క ముడిసరకు ఇవ్వకుండా చేస్తున్న పరిస్థితి కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తా ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో విశాఖ ఉక్కుని రక్షించుకోవడానికి పోరాటాలు తప్ప వేరే మార్గం లేదని రంగారావు తెలిపారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జివి కొండారెడ్డి మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదంతో మారుమోగినటువంటి విశాఖ ఉక్కు ఈరోజు ప్రైవేట్ కరించడం అడ్డుకుంటామని కొండారెడ్డి తెలిపారు .ఆరోజు పరిశ్రమ ఏర్పటానికి ఎన్ని త్యాగాలు చేయాల్సి వచ్చిందో ఎంత సమయం తీసుకున్నామో ఈరోజు కూడా ఉక్కుని రక్షించుకోవడానికి ఫ్యాక్టరీని నిలబెట్టుకోవడానికి అంతే సమయం అంతే త్యాగాలు చేయాలని తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె ఆంజనేయులు మాట్లాడుతూ విశాఖ ఉక్కుని రక్షించుకోవడానికి వ్యవసాయ కార్మికులంతా ఏకమై పోరాడుతామని అన్నారు రాబోయే రోజుల్లో కార్మిక సంఘాలు చేసే పోరాటాల్లో మేము కూడా భాగస్వాములు అవుతామని ఆంజనేయులు తెలిపారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు హనుమారెడ్డిమాట్లాడుతూ కేంద్రానికి సపోర్ట్ చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు పై మాట్లాడటానికి సిద్ధంగా లేదు. విశాఖ ఉక్కు ను రక్షించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిది. ఇంకా డిప్యూటీ కలెక్టర్ పేరయ్య, ఏపీఆర్పిఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు జి శేషయ్య, తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమానికి కే వీరారెడ్డి, ఎస్‌డి సర్దార్, శ్రీ రామ్ శ్రీనివాసరావు, చీకటి శ్రీనివాసరావు, తంబి శ్రీనివాసులు, బివి రావు, సిహెచ్ రాంబాబు,పేరయ్య దామాశ్రీనివాసులు, జి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# క్యాన్సర్ నివారణలో మరో ముందడుగు

# జిజిహెచ్‌లో అధునాతన ఇమ్యునోహిస్టోకెమిస్ట్రీ పరికరం

### క్యాన్సర్ నిర్ధారణ, చికిత్సలో కీలక పాత్ర వహించనున్న ఐహెచ్‌సీ పరికరం

### జిల్లాలో తొలిసారి అందుబాటులోకి

### ఇప్పటి వరకు మహా నగరాల్లో మాత్రమే అందుబాటులో

### ఐహెచ్‌సీ పరికరాన్ని లాంఛనంగా ప్రారంభించిన

### వైద్య కళాశాల ప్రిన్సిపాల్, ఇంచార్జ్ సూపరింటిండెంట్ డాక్టర్ వై ఏడుకొండలరావు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 26)

జిజిహెచ్,వైద్య కళాశాల్లో ఇమ్యునోహిస్టోకెమిస్ట్రీ పరికరం అంబాటులోకి రావడం ప్రకాశం జిల్లా వాసుల అదృష్టం అని, కాన్సర్ పై పోరులో ఈ పరికరం బహుముఖ పాత్ర పోషిస్తుంది అని డాక్టర్ వై ఏడుకొండలరావు అన్నారు. వైద్య కళాశాలలో పిజి నిధులతో సేకరించిన 40 లక్షల విలువైన ఇమ్యునోహిస్టోకెమిస్ట్రీ పరికరాన్ని ప్రారంభించారు. అనుమానం వున్నా వారు లేదా ఎలాంటి రకమైన క్యాన్సర్ సోకింది అన్న విషయం ఈ పరికరం ద్వారా తెలుస్తుంది అన్నారు. ఇమ్యునోహిస్టోకెమిస్ట్రీ క్యాన్సర్ నిర్ధారణ, దశ, చికిత్సలో కీలక పాత్ర పోషిస్తుంది, క్యాన్సర్ వ్యాధిని నివారించడానికి చికిత్సకు , గుర్తింపు చాలా అవసరం అన్నారు. క్యాన్సర్ కణాలలోని నిర్దిష్ట పాయింట్స్ గుర్తించడంలో ఐహెచ్‌సీ సహాయ పడుతుంది అని, వైద్యులు క్యాన్సర్ రకం, ఉప రకాన్ని ఖచ్చితంగా నిర్ధారించడానికి, చికిత్సకు అది ఎలా స్పందిస్తుందో అంచనా వేయడానికి ఈ ఐహెచ్‌సీ పరికరం పాథాలజిస్టులకు సహాయపడుతుంది అని తెలిపారు. క్యాన్సర్ రోగులకు ఎలాంటి ఎటువంటి మందులు ఎంత కాలం వాడాలి అన్నది కూడా ఈ పరికరం ఇచ్చే నివేదికను బట్టి వైద్యులు నిర్ణయిస్తారు అని అయన తెలిపారు. అనవసరమైన , అధిక డోజ్ మందులు వాడే ప్రమాదాన్ని ఈ పరికరం ఉపయోగపడుతుందన్నారు. వైద్యులు మంచి, అత్యుత్తమ చికిత్సలను ఎంచుకోవడానికి ఈ ఇమ్యునోహిస్టోకెమిస్ట్రీ వీలు కల్పిస్తుందన్నారు. రొమ్ము, ఊపిరి తిత్తుల క్యాన్సర్‌లో ఉన్న పలు రకాల క్యాన్సర్ వ్యాధిలో ఈ రకమైన క్యాన్సర్ సోకిందో ఈ పరికరం ద్వారా తెలుసుకోవచ్చున్నారు. ఈ పరికరం ప్రకాశం జిల్లా ప్రజలకు అందుబాటులోకి వచ్చిందన్నారు. ఈ విషయాన్నీ గుర్తించి ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని అయన కోరారు. ప్రివెంటివ్ ఆంకాలజి, సర్జికల్ ఆంకాలజి విభాగాలను సంప్రదిస్తే అవసరమైన వారికీ ఐహెచ్‌సీ ద్వారా పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశం జిల్లాలోని ప్రజలే గాక ఇతర వైద్య రంగంలో వున్నా సంస్థలు ఈ సేవలను ఉపయోగించుకునే వెసులుబాటు కల్పించామన్నారు. ఇందు కోసం పాథాలజీ డిపార్ట్మెంట్ వారికీ సంప్రదించాలని అయన కోరారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ సూపరింటిండెంట్ డాక్టర్ ప్రభాకరరావు, హెచ్‌వోడీ డాక్టర్ సుధాకర్ , ఫీజియాలజి హెచ్‌వోడీ డాక్టర్ దుర్గ దేవి, అనాటమీ హెచ్‌వోడీ డాక్టర్ సుధాకర్ బాబు , కమ్యూనిటీ మెడిసిన్ డాక్టర్ శ్రీదేవి, మైక్రోబయాలజీ డాక్టర్ పద్మ ప్రియ , సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ కిషన్ బాబు , వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.





# ప్రతి ఒక్కరూ యోగా పై దృష్టి సారించాలి

## జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 26)

ప్రకాశం జిల్లాలో తాగు, సాగునీటి అవసరాలు తీరుస్తూ భౌగోళికంగా, ఆధ్యాత్మికంగా ప్రజల జీవన విధానంతో మమేకమై ముందుకు సాగుతుంది గుండ్లకమ్మ నది. మద్దిపాడు మండలం మల్లవరం గ్రామంలో ఈ నదిపై నిర్మించిన ప్రాజెక్టు దీనికి ఒక మకుటం. ఈ రిజర్వాయర్ పక్కనే ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి మందిరం ఈ ప్రాంతానికి మరింత శోభాయమానంగా విరాజిల్లుతోంది. ప్రశాంత వాతావరణంతో పర్యాటకంగా, ఆధ్యాత్మికంగా ప్రసిద్ధిగాంచిన ఈ క్షేత్రం సోమవారం ఉదయం మరింత ప్రత్యేక ఆకర్షణగా నిలిచి జిల్లా ప్రజల దృష్టిని ఆకర్షించింది. యోగాంధ్ర - 2025లో భాగంగా జిల్లా యంత్రాంగం ఇక్కడ యోగాసన కార్యక్రమం నిర్వహించడమే దీనికి కారణం ! మందిర ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ, స్థానిక ఎమ్మెల్యే బి.ఎన్.విజయ్ కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొని యోగాసనాలు వేసి ప్రజల్లో స్ఫూర్తిని నింపారు. ఈ యోగాభ్యాసన కార్యక్రమంలో 400 మందికిపైగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శ్వాస మీద ధ్యాస ఉంచి మనసును, తనువును ఏకం చేసే ప్రక్రియే యోగాభ్యాసనం అన్నారు. ఒత్తిడితో కూడిన నేటి ఉరుకులు, పరుగుల జీవితంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి వ్యక్తిగతంగా ప్రతి ఒక్కరూ దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రకృతితో మమేకం అవుతూ యోగా సాధనే దీనికి ఉత్తమ మార్గం అని ఆమె తెలిపారు. యోగా వలన కలిగే ప్రయోజనాలను తెలియజేస్తూ, ప్రజల్లో దీని పట్ల మరింత ఆసక్తి పెంచేలా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నెల రోజులపాటు ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణకు చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ చెప్పారు. ఇందులో భాగంగా ప్రజలకు శిక్షణ ఇచ్చేందుకు మాస్టర్ ట్రైనర్లను గుర్తించి వారికి కూడా ప్రత్యేక అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. స్థానిక ఎమ్మెల్యే మాట్లాడుతూ సంతోషం, ఆరోగ్యం, సంపన్నవంతమైన సమాజ ఆవిష్కరణకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా ప్రజల ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. యోగాభ్యాసనం ఇందులో ఒక భాగం అని తెలిపారు. యోగాను ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవం దృష్ట్యా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేలా నెల రోజులపాటు నిర్వహించే ఈ కార్యక్రమాలలో పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. జూన్ 21వ తేదీన జిల్లాలో 10 లక్షల మంది యోగాసనాలలో పాల్గొనేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఈవో కిరణ్ కుమార్, డి.ఎం.హెచ్.ఓ. వెంకటేశ్వర్లు, ఆర్డిఓ లక్ష్మీ ప్రసన్న, జిల్లా ఆయుష్ అధికారి బైద్యనాథ్, సీనియర్ మెడికల్ ఆఫీసర్లు పద్మజాతి, శిరీష, మందిర ఈవో నాగేశ్వరరావు, పతంజలి యోగా సంస్థ ప్రతినిధులు సుధీర్, రవి, గుప్తా, నాగేశ్వరరావు, స్కూల్ గేమ్స్ సెక్రటరీ హాజీరా, మహిళాభివృద్ధి - శిశు సంక్షేమ, వైద్య శాఖల సిబ్బంది పాల్గొన్నారు.






## కనిగిరి స్నేహహస్తం ఆధ్వర్యంలో భోజనం వసతి



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, మే 26)

కనిగిరి ప్రభుత్వ ఆసుపత్రి రోగులకు వారి బంధువులకు, యాచకులకు, మతిస్థిమితం లేని వారికి స్నేహ హస్తం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం భోజన వసతి కల్పించారు. స్నేహహస్తం అధ్యక్షులు సుధీర్ బాబు మాట్లాడుతూ వారంలో రెండు రోజులు ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే గర్భిణీ మహిళలకు, పేదలకు మా వంతు సహకారం అందిస్తామని, పేదల ఆకలి తీర్చడం ఎంతో సంతోషంగా ఉందని, ఇటువంటి సేకార్యక్రమాలకు ఎల్లప్పుడు మా స్నేహ హస్తం అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది, స్నేహ హస్తం సభ్యులు కాసిం పీరా, బేబి రాజ్, ఖాసీం, గౌస్, మోహన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## డ్వాక్రా మహిళలకు సమాధానం చెప్పని బ్యాంక్ అధికారులు

### డ్వాక్రా మహిళల పై దురుసుగా ప్రవర్తన



(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, మే 26)

స్థానిక యూనియన్ బ్యాంకులో డ్వాక్రా మహిళలకు అన్యాయం జరుగుతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్వాక్రా మహిళల మహిళలకు తెలియకుండా ఆండ్రాయిడ్ అమౌంట్ వేస్తున్నారని అలాగే ఖాతాదారులకు తెలియకుండా వేరే వాళ్ల అకౌంట్‌కి ఎటువంటి సైన్లు కానీ డాక్యుమెంట్స్ లేకుండా మనీ ట్రాన్స్ఫర్ చేస్తున్నారని, డ్వాక్రా మహిళలు బ్యాంకు మేనేజర్, ఫీల్డ్ ఆఫీసర్‌ను అడగగా మీకు దిక్కున్న చోట చెప్పుకోండి, మా దగ్గర ఎటువంటి అన్యాయం జరగటం లేదు అని వారిపై వాదన దిగుతూ సెక్యూరిటీ ద్వారా బయటకు నెట్టించారు. దీనిపై వివరణ అడగ్గా మేనేజర్ ఫీల్డ్ ఆఫీసర్‌ని అడగమని , ఏదో ఒకరకంగా మాట దాటివేస్తూ సమాధానం చెప్పకుండా తప్పించుకుంటున్నారు. ఫీల్డ్ ఆఫీసర్ అడగ్గా అమౌంట్ సంబంధించి ప్రింట్ ఇస్తానని చెప్పి ప్రింటర్ మిషన్ పనిచేయడం లేదని చెప్పి తప్పించుకున్నాడు. డ్వాక్రా మహిళలు ఫీల్డ్ ఆఫీసర్ పై ఆగ్రహం వ్యక్తం చేసి వారు బ్యాంకు నుండి బయటకు వచ్చారు. ఫీల్డ్ ఆఫీసర్ ఇలా మీరు గొడవ చేస్తే తరువాత నుంచి డ్వాక్రా మహిళలకు లోన్లు కూడా ఇవ్వమని మహిళను బెదిరించాడు. ఇలా గతంలో కూడా వెంకుపాలెం గ్రామంలో ఒక పొదుపు గ్రూపుకు 20 లక్షలు అమౌంట్ కొట్టి నాలుగు నెలలు ఉంచి వారి దగ్గర వడ్డీ వసూలు చేసే క్రమంలో వాళ్లు వెలుగు ఆఫీస్ దగ్గర వచ్చి మేము డాక్రా రుణాలు ఎప్పుడు తీసుకుందామని ప్రశ్నించగా వారు మాకు తెలియదని చెప్పడంతో మేనేజర్, ఫీల్డ్ ఆఫీసర్ కుమ్మక్కై నకిలీ డాక్యుమెంట్ సృష్టించి మహిళలు బెదిరించి లోన్ క్యాన్సిల్ చేపించారు. మళ్లీ కొత్త లోన్ ఇప్పించారు .ఇలా చెప్పుకుంటూ పోతే డాక్రా మహిళలు ఎన్నెన్నో ఉన్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు క్రాప్ లోను, గోల్డ్ లోను తీసుకొని వారు సకాలంలో కట్టనిచో వారి బంధువుల యూనియన్ బ్యాంకులో ఖాతా ఉండటంతో ఆ డబ్బులు వారికి చెప్పకుండా జమ చేస్తున్నారు. వారు ఇదేమని ప్రశ్నించగా ఏదో ఒక సాకు చెప్పి తప్పించుకుంటున్నారు. అలాగే మధ్యవర్తుల ద్వారా వెళితే ఏ పని అయినా సవ్యంగా జరుగుతుంది. అన్ని కరెక్ట్‌గా ఉన్న కొందరికి సాకులు చెబుతూ బ్యాంకు చుట్టూ రోజు తిప్పించుకుంటున్నారు. ఇకనైనా సంబంధించిన అధికారులు పట్టించుకుని తగిన చర్యలు తీసుకోవాలని యూనియన్ బ్యాంక్ ఖాతాదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ఆర్అండ్‌బీ రోడ్ల అభివృద్ధిపై నిర్లక్ష్యం తగదు

### సిపిఎం ప్రాంతీయ కమిటీ కన్వీనర్ బడుగు వెంకటేశ్వర్లు





(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, మే 26)

మండలంలోని అండ్‌బి రోడ్ల అభివృద్ధిపై తీవ్రమైన నిర్లక్ష్యం వివక్ష ప్రదర్శించడం తగదని సిపిఎం ప్రాంతీయ కమిటీ కన్వీనర్ బడుగు వెంకటేశ్వర్లు తెలిపారు. కనిగిరి నుంచి వేములపాడు వరకు ఓబీ రోడ్డు నిర్మాణం గత 11ఏళ్ల నుంచి ఇదే పరిస్థితి కొనసాగుతుందని, ప్రభుత్వాలు మారిన పాలకులు మారిన అధికారంలో ఉండే పార్టీలు మారిన రోడ్డు దుస్థితి మాత్రం మారటం లేదని ఆవేదన వ్యక్తపరిచారు. ఏదో చేస్తున్నట్లుగానే కనిపిస్తున్నారు తప్ప సమస్య పరిష్కరించటలో సంవత్సరాల తరబడి నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. చిన్నపాటి వర్షం వచ్చిన రోడ్లు గుంతల మాయంతో నిండిపోయి ఉంటుందని వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఏ గుంత ఎంత లోతులో ఉందో తెలియక టూ వీలర్స్ పడిపోతున్నాయని వివరించారు. ఎన్నికలకు ముందు ఓట్ల కోసం వచ్చే ప్రతి రాజకీయ పార్టీ నాయకుడు గతంలో నడికుడి రైల్వే మార్గం వెలుగొండ ప్రాజెక్టు పట్ల ఎలాంటి వాగ్దానాలు చేస్తూ వచ్చారు. ఓవి రోడ్డు కనిగిరి నుండి వేములపాడు వెళ్లే రోడ్డు పట్ల కూడా ఇదే రకమైన వాగ్దానాలు ఇస్తూ వస్తున్నారని, కనీసం గుంతలకు మట్టితోలి మార్జిన్ డెవలప్ చేసిన ఘటనలు లేవన్నారు. అనేక ప్రమాదాలు జరిగి ప్రజలు మరణిస్తున్నప్పటికీ కనీసం సామాజిక స్పృహ లేకుండా ప్రవర్తించడం అత్యంత దారుణమైన విషయమన్నారు. ఇప్పటికైనా పాలకవర్గం అధికార యంత్రాంగం స్పందించే విధంగా జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలని సంబంధిత కాంట్రాక్టర్‌తో చర్చించి రోడ్డు సమస్యను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని, ముందస్తుగా పెద్ద పెద్ద గుంతలు అవసరమైన గ్రావెల్ తోలి వాహనదారులకు ప్రాథమిక దశలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించటలో కృషి చేయాలని వీరు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే ప్రజల నుంచి నిరసన ఎదుర్కోవాల్సిన పరిస్థితి వస్తోందని హెచ్చరించారు.

## నగర అభివృద్ధిపై దృష్టి సారించాలి

### అధికారులకు సూచించిన ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 26)

నగర అభివృద్ధిపై దృష్టి సారించి అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు అన్నారు. ఒంగోలు నగరంలోని నగరపాలక సంస్థ కార్యాలయంలో నగరపాలక సంస్థ అధికారులు కార్పొరేటర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మేయర్ గంగాడ సుజాత అధ్యక్షత వహించారు. ఇటీవల కాలంలో నగరం లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలతో పాటు అధికారులు వారి యొక్క పని విధానం మెరుగుపరుచుకునేందుకు కొన్ని సూచనలు చేశారు. మేయర్ గంగాడ సుజాత కార్పొరేటర్ మధ్య కొంత మనస్పర్ధలు వచ్చాయని సమాచారంతో వాటిని సరిచేసి అందర్నీ కలుపుకొని పోయే విధంగా చూసేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలుస్తుంది. ముఖ్యమైన సమావేశం నాకు కమిషనర్ కోడూరు వెంకటేశ్వర్లు, మున్సిపల్ ఇంజనీర్ చంద్రయ్య టౌన్ ప్లానింగ్ శానిటరీ విభాగాలకు సంబంధించిన అధికారులు సిబ్బందితో ముఖాముఖి నిర్వహించి వారికి నగరంలో ఉన్న సమస్యలపై పరిష్కారంపై సూచనలు చేసినట్టు తెలుస్తుంది.

## కుక్కను ఢీకొని మోటార్ సైక్లిస్ట్‌కు గాయాలు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 26)

కర్నూల్ రోడ్డు మహాలక్ష్మి ఫంక్షన్ హాల్ వద్ద సోమవారం సాయంత్రం కుక్క అకస్మాత్తుగా రావడంతో మోటార్ వెహికల్ పై వస్తున్న వ్యక్తి కుక్కని ఢీకొని, కింద పడిపోయారు. వెంటనే విజిబుల్ పోలీసింగ్ విధి నిర్వహణలో ఉన్న ట్రాఫిక్ ఆర్ఎస్ఐ మాల్యాద్రి స్పందించి వెంటనే తన సిబ్బంది సహాయంతో క్షతగాత్రుడిని ఆటోలో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. మోటార్ వెహికల్ మీద ఉన్న వ్యక్తి నూతలపాడు వెళుతుండగా ఈ సంఘటన జరిగింది.

## మహానాడుకు తరలివెళ్లిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 26)

27, 28, 29 తేదీల్లో కడపలో మహానాడు కి చేస్తున్న ఏర్పాట్లను సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్ కుమార్‌తో కలిసి పరిశీలిస్తున్న మద్దిపాడు మండల తెలుగు యువత మాజీ అధ్యక్షుడు పోతినేని శ్రీనివాసరావు (పి.యస్.ఆర్), అలాగే సంతనూతలపాడు నియోజకవర్గం మద్దిపాడు మండలం నుంచి మహానాడుకు టిడిపి నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు.



## ఘనంగా పైలెట్ డే వేడుకలు




(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, మే 26)

స్థానిక ప్రాథమిక వైద్యశాల వద్ద సోమవారం 108 వాహనాల పైలెట్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు అనంతరం వైద్య అధికారులు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు, గ్రామాల్లో అనారోగ్యంగా ఉన్న వారు 108కి కాల్ చేయటంతో వెంటనే బాధితులను వేగంగా వైద్యశాలకు చేర్చి రక్షించడంలో పైలెట్ల కృషి ఎంతో అమోఘమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారులు కృష్ణ చైతన్య, రవి కిరణ్, మండవ ప్రసాద్, పల్లపోతు ప్రసాద్, పల్లపోతు వెంకట్రావు, 108 సిబ్బంది వాసు, నాగబాబు, వైద్యశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సిసిఆర్‌సి కార్డుల జారీ లక్ష్యాలు పూర్తి చేసేందుకు చర్యలు

### జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి



**(షణ్ముఖ వెలుగు, బాపట్ల, మే 26)**
సి.సి.ఆర్.సి కార్డుల జారీ లక్ష్యాలు పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు. సీసీఆర్ సి కార్డుల జారీ, అన్నదాత సుఖీభవ పథక అమలుపై రాష్ట్ర రాజధాని అమరావతి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వ్యవసాయ శాఖ ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్,



వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీ రావు, సిసిఎల్ఏ ప్రత్యేక కార్యదర్శి జయలక్ష్మి సోమవారం వీక్షణ సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో సీసీ ఆర్సీ కార్డుల జారీ జూన్ మాసంలోపు పూర్తి చేయాలన్నారు. ఈ కార్డులను నిజమైన రైతులకు ఇవ్వకుండా ఇతరులకు ఇవ్వడం జరుగుతుందన్నారు. సిసిఆర్సి కార్డులను రెన్యువల్ చేసి వారికి బ్యాంకు రుణాలు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అన్నదాత సుఖీభవ పథకంలో ల్యాండ్ రికార్డులను ఆధార్తో అనుసంధానం చేయాలన్నారు. ఆధార్ తో లింక్ కానీ భూములను తహసిల్దార్లచే వాటిని వెంటనే అనుసంధానం చేయుటకు చర్యలు తీసుకోవాలన్నారు. బాపట్ల జిల్లాలో గత సంవత్సరం లక్ష సిసిఆర్ సి కార్డులకు గాను 92 వేల కుటుంబాలకు కార్డులు జారీ చేయడమైనదని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు. వీరిలో 11370 కుటుంబాలకు 55 కోట్లు రుణం ఇవ్వడమైనదని ఆయన తెలిపారు. ఈ సంవత్సరం ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయుటకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లాలో మూడు లక్షల 41 వేల 974 మంది రైతులు ఉన్నారని ఆయన తెలిపారు. జిల్లాలో 80% ల్యాండ్ రికార్డులను ఆధార్తో అనుసంధానం చేయడమైనది అని తెలిపారు. మిగిలిన వాటిని పూర్తి చేయుటకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. జిల్లాలో సిసిఆర్సి కార్డుల లక్ష్యాలను పూర్తి చేయుటకు చర్యలు తీసుకోవాలని ఆయన వ్యవసాయ శాఖ అధికారిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామకృష్ణ పాల్గొన్నారు.

## ఛీటింగ్ కేసులో విచారణకు జడ బాల నాగేంద్ర



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 26)**
ఛీటింగ్ కేసులో జనసేన పార్టీ జిల్లా ప్రచార కార్యదర్శి జడ బాల నాగేంద్రంను తాలూకా పోలీసులు విచారణకు తీసుకువెళ్లారు. రియల్ ఎస్టేట్ కి సంబంధించి డబ్బులు విషయంలో ఛీటింగ్ చేసారని మండవ వారి పాలెం చెందిన వ్యక్తులు కేసు పెట్టడంతో విచారణకు తాలూకాకి తీసుకెళ్లడం జరిగింది. అయితే ఇటీవల కాలంలో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసులు రెడ్డికి వత్తాసు పలుకుతూ జడ బాల నాగేంద్రం ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌పై అనేక ఆరోపణలు చేశారు. జడ ఆరోపణలకు దీటుగా ఒంగోలుకు చెందిన టిడిపి నాయకులు మీడియా సమావేశం నిర్వహించి జవాబు చెప్పారు. అయినప్పటికీ జడ మరోమారు సోమవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ నేపథ్యంలో జడను విచారణ నిమిత్తం పోలీసులు తీసుకు పోవటంతో ప్రాధాన్యత సంతరించుకుంది.

## మాజీ మంత్రి కాకాణి అరెస్టు దారుణం

### దర్శి ఎమ్మెల్యే, ప్రకాశం జిల్లా వైసీపీ అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 26)**
ఎవరో ఇచ్చిన అబద్ధపు వాంగ్మూలం ఆధారంగా మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని అరెస్టు చేయడం దుర్మార్గమని దర్శి ఎమ్మెల్యే ప్రకాశం జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి అన్నారు. ఆదివారం కాకాణి గోవర్ధన్ రెడ్డిని అరెస్టు చేశామని పోలీసు ధృవీకరించారు. ఆదివారం మధ్యాహ్నం 2:00 గంటలకు గోవర్ధన్‌రెడ్డిని అరెస్టు చేస్తే ఎక్కడ ఉంచారు, ఎక్కడికి తీసుకెళ్తున్నారు అన్న కనీస సమాచారం కూడా లేకుండా గోప్యంగా ఉంచడం చట్ట విరుద్ధమని మాజీ మంత్రిగా పనిచేసిన ఒక వ్యక్తిని అరెస్టు చేసినప్పుడు కనీస సమాచారం ఇవ్వాలన్న బాధ్యత పోలీసు డిపార్ట్మెంట్ పై లేకపోవడం బాధ్యత రాహిత్యమేనని బూచేపల్లి అన్నారు. ఈ రాష్ట్రంలో ఎప్పుడూ ఈ విధంగా అక్రమ కేసులు నమోదు చేయడం జరగలేదని, గతంలో ఎన్నడూ ఇలాంటి సంస్కృతి లేదని, ఇది మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. కాకాణి గోవర్ధన్ రెడ్డిపై పెట్టిన అక్రమ కేసు విషయంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చట్టబద్ధంగా పోరాటం చేస్తుందన్నారు. ఈ కేసులో కాకాణి గోవర్ధన్‌రెడ్డి క్లీన్ చిట్‌తో బయటికి వస్తారని నమ్మకం తమకుందని, వైసీపీ కేడర్ మొత్తం కాకాణి గోవర్ధన్ రెడ్డికి అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ రోజు ప్రతిపక్ష పార్టీ నేతలు అధికార పార్టీ ఇచ్చిన హామీల గురించి ప్రశ్నిస్తున్నారన్న ఒకే ఒక్క కారణంతో వారిపై అక్రమ కేసులు పెట్టి ప్రజలను కూడా భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, ఇది అప్రజాస్వామ్యకమన్నారు.

# విచారణ జరగకపోవడం దారుణం



### కలికివాయి బిట్రగుంట ఘటన పై దళిత హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి రఘురాం, మాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తుల్లిబిల్లి అశోక్ బాబు

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 26)**
రాష్ట్ర సాంఘిక శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి ప్రాతినిధ్యం వహిస్తున్న కొండపి నియోజకవర్గంలోని కలికివాయి బిట్రగుంటలో అంబేద్కర్‌కి అవమానం జరిగినప్పటికీ ఇంతవరకు దానిపై విచారణ జరిపించకపోవడం దారుణమని దళిత హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి రఘురాం, మాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తుల్లిబిల్లి అశోక్ బాబు విమర్శించారు. కెవిపిఎస్ ఇతర దళిత సంఘాల ఆధ్వర్యంలో కలికివాయి బిట్రగుంటలో అంబేద్కర్ ఊరేగింపును అడ్డుకున్న వారిపై సుమోటగాకేసు నమోదు చేసి ఎస్సీ,ఎస్టీ చట్టం ద్వారా నిందితులను అరెస్టు చేయాలని, ఒంగోలు నగరంలో కలెక్టరేట్ వరకు నిరసన కార్యక్రమం చేపట్టి అనంతరం గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రదర్శనకు ముందు ఒంగోలు కలెక్టర్ కార్యాలయం ముందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా దళిత హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ పవన్ కళ్యాణ్ ఫోటోలు మార్ఫింగ్ చేశారని అందువల్ల రామ్ గోపాల్ వర్మ పై కేసు పెట్టి ప్రకాశం జిల్లా వరకు తీసుకొచ్చారని, పవన్ కళ్యాణ్ ను బూతులు తిట్టారని మాటల రచయిత పోసాని కృష్ణమురళీని జైల్లో పెట్టారని, అటువంటిది ఈ దేశానికి రాజ్యాంగ బిక్ష పెట్టిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటాన్ని గ్రామంలో వూరే గిస్తుంటే అగ్రవర్ణ కులాలకు చెందిన కొంతమంది అడ్డుకుంటే వారినందుకు అరెస్టు చేయలేదని అరెస్టు చేయడంలో ఇంత తాత్సారం ఏంటని ప్రశ్నించారు. ఈ దేశంలో ప్రతి ఒక్కరికి భావ ప్రకటన స్వేచ్ఛ ప్రదర్శన చేసుకునే స్వేచ్ఛ ఉందని ఇతర హక్కులకు భంగం కలిగిస్తే అది ఖచ్చితంగా చట్టరీత్యా నేరమని అన్నారు. సంఘటన జరిగి 40 రోజులకు పైన అయినా కానీ సీఐ హజరత్తయ్య అక్కడే ఉన్నా నిందితులను అరెస్టు చేయకపోవడంలో ఉన్న కారణాలు ఏంటో తెలియజేయాలని కోరారు. ఖచ్చితంగా ఈసంఘటన పట్ల దళిత సమాజం చూస్తూ ఊరుకోదని, రానున్న రోజుల్లో ఈ విషయంపై మరింత తీవ్రంగా ఉద్యమం చేపడుతామని పేర్కొన్నారు. అంబేద్కర్ చిత్రపట ప్రదర్శనను అడ్డుకున్న వారిని అరెస్టు చెయ్యకపోతే ఛలో కలికికివాయి బిట్రగుంట కార్యక్రమానికి పిలుపునిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిహెచ్పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు కరవది సుబ్బారావు, జేఏసీ నాయకుడు ఏడుకొండలు, ఆర్ మోషే, దాసరి సుందరం, ఓపిడి ఆర్ సుధాకర్, దాసరి చెన్నకేశవులు, కంకణాల ఆంజనేయులు, సంజీవరావు, కోటి, మేడిద రవి, తదితరులు పాల్గొన్నారు.





## ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలి

### సిపిఐ, ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు చిట్టిపాటి వెంకటేశ్వర్లు



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 26)**
ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని నారాయణపూర్ ఎన్‌కౌంటర్ పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, మృతి చెందిన వారి భౌతిక కాయాలను వారి కుటుంబాలకు అప్పగించాలని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఒంగోలు కలెక్టర్ కార్యాలయం వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. నారాయణపూర్‌లో జరిపినవి అన్ని ప్రభుత్వ హత్యలేనని, ఆపరేషన్ దగా పేరుతో ఆదివాసీలపై హింసను ఆపాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు చిట్టి పాటి వెంకటేశ్వర్లు అన్నారు. అభయారణ్యాల్లోని ఖనిజ సంపాదన కార్పొరేట్ వ్యవస్థలకు కట్టపెట్టేందుకు దారుణమైన హింసకాండకు కేంద్ర ప్రభుత్వం పూనుకుందన్నారు. ఆపరేషన్ కగారి పేరుతో వేలాది మంది మిలటరీ బలగాలను దించి అమాయకులైన గిరిజనులను వారికి అండగా నిలబడుతున్న నక్సలైట్లను అత్యంత క్రూరంగా ఎన్‌కౌంటర్ చేస్తున్నారని ఇది ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టని అన్నారు. మావోయిస్టు పార్టీలతో చర్చలు జరిపి శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు ప్రభుత్వం ముందుకు రావాలని అన్నారు. మానవ హక్కులను కాల వాస్తు అమాయకులను చంపటం ఏంటని ప్రశ్నించారు. ఇంతవరకు ఎన్‌కౌంటర్లో మృతి చెందిన వారి మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అందజేయడంలో తీవ్ర అలసత్వం వహిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కే వీరారెడ్డి, పిఓడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి పద్మ, క్రాంతి, ఓపిడిఆర్ రాష్ట్ర కార్యదర్శిచావలి సుధాకర్, పిడిఎం వెంకటేష్ ఏబీఎన్ఎస్ పద్మ, రాజా ఆదివాసి హక్కుల సంఘం వేదిక జిల్లా కన్వీనర్ వీరాంజనేయులు జిల్లా కన్వీనర్ వీరాంజనేయులు సుందరం తదితరులు పాల్గొన్నారు.

## నీటి సమస్యను తక్షణం పరిష్కరించాలి

### మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్



**(షణ్ముఖ వెలుగు, కనిగిరి, మే 26)**
కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని పాత సాయి బాబా గుడి ప్రాంతంలో సోమవారం కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ షేక్ పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికుల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. రెండు నెలల నుంచి బోరు పనిచేయకపోవడంతో నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు సమస్యను మున్సిపల్ చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన మున్సిపల్ చైర్మన్ బోరుకు మరమ్మత్తులు చేపట్టి , రెండు రోజుల్లో సమస్యను పరిష్కరించి ప్రజలకు నీటిని అందించాలని సిబ్బందిని ఆదేశించారు. కనిగిరి మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడా నీటి సమస్య తలెత్తకుండా చూడాలని, ఇటువంటి సమస్యలు ఎక్కడ ఉన్నా తక్షణం స్పందించాలని సిబ్బందిని మున్సిపల్ చైర్మన్ ఆదేశించారు. కార్యక్రమంలో వర్క్ ఇన్స్పెక్టర్ షరీఫుద్దీన్ వార్డు ఇమ్యూనిటీ లావణ్య, లైన్ మాన్ వలి, స్థానికులు పాల్గొన్నారు.

# హత్యా రాజకీయాలు వద్దు అభివృద్ధి ముద్దు - యాగంటి

**(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, మే 26)**
వెనుకబడిన పలనాడు ప్రాంతంలో ఇకనైనా హత్య రాజకీయాలకు స్వస్తి పలికి అభివృద్ధి వైపు అడుగులు వేసేందుకు అందరు సహకరించాలని మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు కోరారు. సోమవారం ఆయన మాచర్ల లోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. హత్య రాజకీయాల వలన అభివృద్ధి కుంటు పడటంతో పాటు,అనేక కుటుంబాలు రోడ్డును పడతాయి. అన్న విషయం ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు. గుండ్లపాడు లో జరిగిన జంట హత్యలు బాధాకరమన్నారు. హత్య చేసిన వారితోపాటు హత్య కాబడిన కుటుంబాల పరిస్థితి ఏమిటన్న విషయం ఒక క్షణం ఆలోచిస్తే జరిగిన నష్టం అర్థమవుతుంది. క్షణికావేశంతో చేస్తున్న హత్యలు ఎన్నో కుటుంబాలను రోడ్డుపాలు చేస్తున్న విషయం ఇకనైనా తెలుసుకోవాలని హితవు పలికారు. ఆధిపత్యం కోసం, నాయకుల మెప్పుకోసం ఒకరినొకరు హత్యలు చేసుకుంటూ పోతే నష్టపోయేది మీ కుటుంబాలే.ఎటువంటి సమస్యలు ఉన్న కూర్చుని మాట్లాడుకుంటే పరిష్కారం అవుతాయని ప్రతి ఒక్కరు గమనించాలి. అభివృద్ధిలో వెనుకబడిన మన మాచర్ల ప్రాంతాన్ని మన ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి చేస్తున్న అభివృద్ధి కార్యక్రమలు ఈ హత్యాకాండ వల్లన కుంటుపరుస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో ఎక్కడ లేని విధంగా మాచర్ల ప్రాంతంలోనే ఈ హత్య రాజకీయాలు జరుగుతుండడం ఆందోళనకరమని పేర్కొన్నారు. ఇప్పటికైనా హత్య రాజకీయాలు ప్రోత్సహిస్తున్నవారు మానుకోవాలని కోరారు. హత్య రాజకీయాలు మానుకొని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి చేస్తున్న అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. పల్లెల్లో రక్తషిక్తం కావడం వలన భయాందోళనలో ప్రజలు ఉండడంతో పాటు అభివృద్ధి పనులు జరగవన్నారు. వెనుకబడిన మాచర్ల ప్రాంతంలో విద్యాపరంగా గణనీయ మార్పులు వచ్చి పిల్లలు మంచి మంచి ఉద్యోగాలలో స్థిరపడుతున్న విషయం పెద్దలు గుర్తించాలని కోరారు. పిల్లల్ని ప్రయోజకులుగా తీర్చిదిద్దుకుంటే ఆ కుటుంబాలు ఎంతో అభివృద్ధి సాధిస్తాయి. ఒకరినొకరు చంపుకుంటూ పోతే కుటుంబంలోని మహిళలు వారి పిల్లలు అనాధలుగా మారతారని ఆందోళన వ్యక్తం చేశారు. చిన్న చిన్న గొడవలను పెద్దవిగా చేసుకుంటూ వాటిని హత్యల వరకు తీసుకువెళ్లడం మంచి పద్ధతి కాదు. ఇకనైనా పల్నాడు



ప్రాంతంలో అభివృద్ధి వైపు అడుగులు ఉండాలే కాని హత్య రాజకీయాలు ఉండకూడదని కోరారు. ఈ ఫ్యాక్షనిజంలో నా తండ్రిని కోల్పోయి ఎన్ని ఇబ్బందులు పడ్డానో నాకు తెలుసునని యాగంటి ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ పెద్ద దూరమైతే ఆయన మీద ఆధారపడిన వంటి భార్యాబిడ్డలు మరియు అతని వృద్ధులైన తల్లిదండ్రులు పడే భాద ఆవేదన మాటలో చెప్పలేమని పేర్కొన్నారు.గ్రామస్థాయిలో రాజీ పడేందుకు అవకాశం లేకపోతే పై స్థాయిలో పెద్దలు చాలామంది ఉంటారు. ఫ్యాక్షనిజం జోలికి వెళ్లి హత్య రాజకీయాలు చేసుకుంటే పోలీస్ స్టేషన్లో కోర్టులు చుట్టూ తిరిగి సమయంతో పాటు ఆర్థికంగా నష్టపోవాల్సి ఉంటుంది. అందరూ కలిసికట్టుగా గ్రామ అభివృద్ధిలో పోటీ పడలేకనే రాజకీయంగా ఒకరిపై ఒకరు ఆధిపత్యం కోసం హత్య రాజకీయాలు చేసుకోవడం ఇకనైనా మానుకోవాలని సూచించారు. ఇకనైనా కక్ష కార్పన్యాలు వదిలి గ్రామాభివృద్ధిలో ఒకరికి ఒకరు పోటీపడాలి. రాజకీయాలు ఎన్నికల వరకే పరిమితం చేసి మిగతా సమయం అంతా గ్రామ అభివృద్ధిలో అందరూ కలిసికట్టుగా ముందుకు అడుగులు వేయాలి. గ్రామ అభివృద్ధితో పాటుగానే ప్రతి ఒక్కరూ ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు దృష్టి సారించాలి. పల్లెలు దేశానికి పట్టుకొమ్మలని మహాత్మా గాంధీ అన్న నినాదాన్ని ఆదర్శంగా తీసుకొని ఇకనుంచి అందరూ పల్లెల్లో ప్రశాంతత నెలకొనేలా కృషి చేయాలి. పదవులు, రాజకీయాలు శాశ్వతం కాదు. స్నేహాలు, బంధుత్వాలే శాశ్వతం అని యాగంటి మల్లికార్జున రావు విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం కార్యకర్తలు పాల్గొన్నారు.

# పీజీఆర్ఎస్‌లో నమోదయ్యే అర్జీలను అధికారులు తక్షణమే పరిష్కరించాలి



## జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి







(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, మే 26)
పీజీఆర్ఎస్‌లో నమోదయ్యే అర్జీలను అధికారులు తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. పిజిఆర్ఎస్ కార్యక్రమం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సోమవారం స్థానిక కలెక్టరేట్లో జరిగింది. మా సమస్యలు పరిష్కరించాలంటూ జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితులు వినతి పత్రాల ద్వారా కలెక్టర్‌కు విన్నవించారు. 177 అర్జీలు నమోదు కాగా, తన పరిధిలో ఉన్న వాటికి ఆయన తక్షణమే పరిష్కార మార్గం చూపారు. కొన్నిటిని పరిశీలన, మరికొన్నిటిని విచారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తన పరిధిలో లేని వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తామని చెప్పారు. అర్జీల పరిష్కారంపై ప్రజల సంతృప్తి స్థాయి పెరిగేలా అధికారులు పనిచేయాలని కలెక్టర్ చెప్పారు. పి జి ఆర్ ఎస్ పై అధికారులు నిర్లిప్తంగా ఉండరాదన్నారు. ప్రజలు సుభిక్షంగా ఉండడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. 22ఏ క్యాటగిరీలో పెండింగ్లో ఉన్న 108 అర్జీలను తక్షణమే పరిష్కరించాలని ఆర్డీవోలకు సూచించారు. సాధారణ బదిలీల్లో అధికారులు పారదర్శకత పాటించాలన్నారు. బాపట్ల జిల్లాలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులను ఇతర జిల్లాలకు బదిలీ చేయరాదన్నారు. ఆ స్థానంలో పొరుగు జిల్లాల నుంచి అదే హోదాలో వచ్చే వారు ఉంటేనే అనుమతి కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, ఉప కలెక్టర్ లవన్న, డిఆర్డిఏ పిడి శ్రీనివాసరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం

### జిల్లా అధ్యక్షుడిగా కోమటికుంట వెంకటేశ్వర్లు







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 26)
ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం నూతన జిల్లా అధ్యక్షుడిగా కోమటిగుంట వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రభుత్వం నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా ఎన్నికలు ఒంగోలులోని సంఘ కార్యాలయంలో నిర్వహించారు. ఈ ఎన్నికలకు ఎన్నికల అధికారిగా డాక్టర్ ఎన్ సుబ్రహ్మణ్యం, సహాయ ఎన్నికల అధికారిగా కే రమణ, పర్యవేక్షులుగా ఈ సుబ్రహ్మణ్యం హాజరయ్యారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్ మల్లేశ్వరరావు మాట్లాడుతూ జిల్లా కార్యవర్గమంతా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షుడిగా ఎంపికైన కోమటిగుంట వెంకటేశ్వర్లు సంఘ కార్యాలయ స్థలాన్ని కాపాడేందుకు అనేక పోరాటాలు చేస్తున్నారన్నారు. ఆయన పోరాట పటిమను చూసిన సంఘ సభ్యులు జిల్లా అధ్యక్షుడుగా వెంకటేశ్వర్లు ఎన్నుకోవడం అభినందనీయమన్నారు. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోట చెన్నప్ప మాట్లాడుతూ సభ్యులు తమ హక్కుల సాధనకై పోరాటాలు చేయాలన్నారు. రాష్ట్ర సంఘం ఎల్లవేళలా అండదండగా ఉంటుందని హామీ ఇచ్చారు. సంగం జిల్లా అధ్యక్షులుగా కోమటి గుంట వెంకటేశ్వర్లు, సహాధ్యక్షులుగా ఆలేటి నాగయ్య, ఉపాధ్యక్షుడిగా గన్నేపూడి యోబు, ముప్పరపు వెంకయ్య, కార్యదర్శిగా డి ప్రేమ నాథ్, సహాయ కార్యదర్శులుగా బి వి సుబ్బారావు, పులుకూరి దేవ కుమారి, ప్రచార కార్యదర్శిగా శాసనాల రమాదేవి, కోశాధికారిగా జిల్లా సుబ్బరాయుడు, తదితరులను రాష్ట్ర నాయకత్వం అభినందనలు తెలిపారు.

## జగన్ పొదిలి పొగాకు వేలం కేంద్ర సందర్శనను విజయవంతం చేయండి

### గుంటక తిరుపతిరెడ్డి పిలుపు

(షణ్ముఖ వెలుగు, వెలిగండ్ల, మే 26)
రాష్ట్ర వ్యాప్తంగా పొగాకు రైతులకు సరైన గిట్టుబాటు ధర లభించకపోవడంతో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి 28వ తేదీ ప్రకాశం జిల్లా పొదిలి వేలం కేంద్రాన్ని రైతులతో కలిసి సందర్శించనున్నారని జిల్లా వైసీపీ ఉపాధ్యక్షులు జిల్లా జెడ్పీటీసీ సంఘం అధ్యక్షులు వెలిగండ్ల జడ్పిటిసి



గుంటల తరపతి రెడ్డి పార్టీ శ్రేణులకు తెలిపారు. సోమవారం మండలంలో వైసిపి కార్యకర్తల సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రైతులకు భరోసా కల్పించేందుకు పొగాకు వేలం కేంద్రం వద్ద గిట్టుబాటు ధర కల్పించాలని రాష్ట్రవ్యాప్తంగా పొగాకు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున వారికి సరైన ధర ఉండాలనే ఉద్దేశంతో జగనన్న 28వ తేదీ పొదిలి పొగాకు వేలం కేంద్రానికి వస్తున్నారన్నారు. పొగాకు రైతులు, వైసిపి కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ గజ్జల వెంకటరెడ్డి, వెలిగండ్ల సర్పంచ్ లు తాతపూడి సురేష్ బాబు, శ్యామల కృష్ణారెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు కాకర్ల వెంకటేశ్వర్లు,పోల్లా సుబ్రమణ్యం, చిలకల నారాయణరెడ్డి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్వరనీరాజనం కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

### కొత్త మాసు శ్రీరామ మూర్తి



(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, మే 26)
గాన గాంధర్వుడు డాక్టర్ ఎస్పీ బాలసుబ్రమణ్యం 79వ జయంతిని పురస్కరించుకొని డాక్టర్ ఎస్పీ బాలసుబ్రమణ్యం కళాపరిషత్ మాచర్ల వారి ఆధ్వర్యంలో మాచర్ల పట్టణంలోని మానుకొండ కళ్యాణ మండపంలో జూన్ 1వ తేదీన సాయంత్రం 7 గంటలకు రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి సినిమా పాటల పోటీలు నిర్వహించడం జరుగుతుందని కళా పరిషత్ అధ్యక్షులు కొత్త మాసు శ్రీరామమూర్తి సోమవారం మాచర్ల పట్టణంలోని మెడికల్ అసోసియేషన్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలియజేశారు. ఈ సందర్భంగా కొత్త మాసు శ్రీరామమూర్తి మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి హాజరుకానున్నట్లు ఆయన పేర్కొన్నారు డాక్టర్ ఎస్పీ బాలసుబ్రమణ్యం మీద అభిమానంతో కళామతల్లి ముద్దుబిడ్డల ప్రోత్సాహంతో నూతనంగా మాచర్ల పట్టణంలో డాక్టర్ ఎస్పీ బాలసుబ్రమణ్యం కళాపరిషత్ ను స్థాపించడం జరిగిందని, మొదటి ప్రయత్నంగా జూన్ 1న కళాపరిషత్ ఆధ్వర్యంలో సినిమా పాటల పోటీలు నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ పోటీలలో పాల్గొనదలచిన వారు జూన్ 1వ తేదీన ఉదయం 9 గంటలకు మానుకొండ కళ్యాణ మండపంలో జరిగే ఎంపికకు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన అన్నారు. ఎంపిక ప్రక్రియలో 25 మంది గాయనీ గాయకులను మాత్రమే ఎంపిక చేయడం జరుగుతుందని ఎంపికైన వారితో సాయంత్రం 7 గంటలకు పోటీలు నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ పోటీలలో గెలుపొందిన గాయనీ గాయకుల ఐదుగురుని విజేతలుగా ప్రకటించి మొదటి బహుమతిగా 10000 రూపాయలను, రెండవ బహుమతిగా 7000 రూపాయలను, మూడవ బహుమతిగా 5000 రూపాయలను, నాలుగో బహుమతిగా 4000 రూపాయలను, ఐదో బహుమతిగా 3000 రూపాయలను అందజేయడం జరుగుతుందని ఆయన అన్నారు అదేవిధంగా పోటీలో పాల్గొన్న మరో 20 మందికి 1000 రూపాయల చొప్పున కన్సోలేషన్ బహుమతులను అందజేస్తామన్నారు కనుక కళాభిమానులు ఎస్పీ బాలసుబ్రమణ్యం అభిమానులు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కళాపరిషత్ ఉపాధ్యక్షులు బాహటం శేషగిరి రాజు, ప్రధాన కార్యదర్శి మాగులూరి రాంబాబు, కోశాధికారి పటాన్ జాన్ ఖాన్, జాయింట్ సెక్రటరీ పులుసు శ్రీనివాసరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఓరుగంటి చెన్నకేశవరావు పలువురు కళాభిమానులు పాత్రికేయ మిత్రులు పాల్గొన్నారు.

## వెంకటేశ్వర్లు కుటుంబానికి జనసేన పార్టీ తరుపున రూ.1 లక్ష ప్రమాద భీమా అందజేత

### భీమా నగదు అందజేసిన జనసేన పార్టీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఇమ్మడి కాశీనాథ్





(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, మే 26)
ప్రకాశం జిల్లా జనసేన పార్టీ మార్కాపురం నియోజకవర్గ కార్యాలయం నందు సోమవారం రాత్రి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మార్కాపురం ఎనామిల్ ఆపరేటర్ సప్పరపు వెంకటేశ్వర్లు మృతి పట్ల జనసేన పార్టీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఇమ్మడి కాసీనాథ్ సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ కార్యకర్తలకు పార్టీ ఎళ్ళవేళలా అండగా నిలుస్తుందని చెప్పారు. తొలుత మార్కాపురం ఎనామిల్ ఆపరేటర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ తరుపున ఇమ్మడి కాశీనాథ్, ఎనామిల్ ఆపరేటర్స్ అండ్ వర్కర్స్ సహకారంతో వారి కుటుంబానికి లక్ష రూపాయలు ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. అలాగే సప్పరపు వెంకటేశ్వర్లుకి జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వం ఉన్నందున వారి కుటుంబానికి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదల పవన్ కళ్యాణ్ కి తెలియజేసి జనసేన పార్టీ తరపున 5 లక్షల రూపాయల ప్రమాద బీమాను త్వరగా మంజూరు చేయిస్తామని తెలియజేశారు. అనంతరం ఇటీవల జరుగుతున్న రోడ్డు ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించి, తగిన జాగ్రత్తలు వహించాలని కోరారు.

## మాజీ మంత్రి కాకాణి అరెస్టును ఖండించిన గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నా రాంబాబు

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, మే 26)



ఎవరో ఇచ్చిన అబద్ధపు వాంగ్మూలం ఆధారంగా మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని అరెస్టు చేయడం దుర్మార్గమని గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నా రాంబాబు అన్నారు. నిన్న కాకాణి గోవర్ధన్‌రెడ్డిని అరెస్టు చేశామని పోలీసు ధృవీకరించారు. నిన్న మధ్యాహ్నం 2 గంటలకు గోవర్ధన్ రెడ్డిని అరెస్టు చేస్తే ఎక్కడ ఉంచారు, ఎక్కడికి తీసుకెళ్తున్నారు అన్న కనీస సమాచారం కూడా లేకుండా గోప్యంగా ఉంచడం చట్ట విరుద్ధమన్నారు. మాజీ మంత్రిగా పనిచేసిన ఒక వ్యక్తిని అరెస్టు చేసినప్పుడు కనీస సమాచారం ఇవ్వాలన్న బాధ్యత పోలీసు శాఖ పై లేకపోవడం బాధ్యత రాహిత్యమేనని అన్నారు. ఈ రాష్ట్రంలో ఎప్పుడూ ఈ విధంగా అక్రమ కేసులు నమోదు చేయడం జరగలేదని, గతంలో ఎన్నడూ ఇలాంటి సంస్కృతి లేదని, ఇది మంచి పద్ధతి కాదని ఆయన హెచ్చరించారు. కాకాణి గోవర్ధన్ రెడ్డిపై పెట్టిన అక్రమ కేసు విషయంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చట్టబద్ధంగా పోరాటం చేస్తుందన్నారు. ఈ కేసులో కాకాణి గోవర్ధన్‌రెడ్డి క్లీన్ చిట్‌తో బయటికి వస్తారని నమ్మకం తమకుందని, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కేడర్ మొత్తం కాకాణి గోవర్ధన్‌రెడ్డికి అండగా నిలుస్తుందన్నారు. ప్రతిపక్ష పార్టీ నేతలు అధికార పార్టీ ఇచ్చిన హామీల గురించి ప్రశ్నిస్తున్నారన్న ఒకే ఒక్క కారణంతో వారిపై అక్రమ కేసులు పెట్టి ప్రజలను కూడా భయాందోళనకు గురి చేస్తున్నారని, ఇది అప్రజాస్వామ్యం అని ఆయన అన్నారు. అన్నారు.




## బాలికపై అత్యాచారానికి యత్నించిన వ్యక్తి అరెస్ట్

(షణ్ముఖ వెలుగు, కంభం, మే 26)
కంభం మండలం జంగంగుంట్ల గ్రామానికి చెందిన ఓ మైనర్ బాలికను అదే గ్రామానికి చెందిన మునిగేటి శరవయ్య అనే వ్యక్తి కందులాపురం అడ్డ రోడ్డు వద్ద అత్యాచారం చేసేందుకు ప్రయత్నించాడు. తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని రిమాండ్ కు తరలిస్తున్నట్లు సోమవారం కంభం ఎస్సై నరసింహారావు మీడియాకు ఓ ప్రకటన విడుదల చేశారు. కొద్ది రోజులుగా బాలిక పట్ల నిందితుడు ఫోన్ లో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని తల్లితండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## మండవను కలిసిన పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార రాజ



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 26)

కృష్ణా జిల్లా పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార రాజ మహానాడుకు వెళుతూ సోమవారం మధ్యాహ్నం మార్గమధ్యంలో ఒంగోలులో ఆంధ్రప్రదేశ్ కమ్మవారి సేవా సమాఖ్య ట్రస్ట్ చైర్మన్ మండవ మురళీకృష్ణ నివాసానికి వచ్చారు. గత ఏడాది జరిగిన సాధారణ ఎన్నికల్లో మురళీకృష్ణ తన స్వంత నియోజకవర్గం పామర్రులో తన విజయానికి చేసిన కృషిని మరువలేనదని, అందుకే స్వయంగా కలవటానికి వారి ఇంటికి వచ్చానన్నారు. ఈ సందర్భంగా మండవ మురళీకృష్ణ కుటుంబ సభ్యులు పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార రాజకి ఆతిథ్యం ఇచ్చి అనంతరం సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండవ సుబ్బారావు, దుగ్గినేని వెంకటరావు,నంబూరి శ్రీరాములు, గోగినేని కిషోర్, రాయపాటి జగదీష్, మాదాల రవి, మన్నం అంజయ్య, చుంచు వాసు బాబు, తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు క్యారమ్స్, చెస్ పోటీలు







(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మే 26)

ఉలవపాడు శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా సోమవారం విద్యార్థులతో ముందుగా పుస్తక పఠనం చేపించి అనంతరం వారిలో దాగివున్న సృజనాత్మక శక్తి వెలికితీసే క్రమంలో వారికి క్యారమ్స్ చెస్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 28 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు గ్రంథాలయ పాలకుడు డి కోటేశ్వరరావు తెలియజేశారు. యాక్టివిటీ స్టోరీ టెల్లింగ్ ఫ్యాకల్టీగా యు భాస్కర్ రాజ పాల్గొన్నారు.

## శారీరక ఆరోగ్య అభివృద్ధి కోసం ప్రత్యేక యోగా అభ్యాస శిబిరం





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 26)

యోగాంధ్ర 2025 ను పురస్కరించుకొని నెల రోజులు రాష్ట్రంలో యోగా ప్రచార కార్య క్రమాల నిర్వహణలో భాగంగా సోమవారం జిల్లా జైలులో ఖైదీల మానసిక శాంతి, శారీరక ఆరోగ్య అభివృద్ధి కోసం ప్రత్యేక యోగా అభ్యాస శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఖైదీలు ఉత్సాహంగా పాల్గొని వివిధ యోగా ఆసనాలు, ధ్యాన పద్ధతులను ఆచరించు చున్నారు.ఈ యోగా శిక్షణను ప్రముఖ యోగా గురువులు పతంజలి శ్రీనివాస్ శిష్య బృందం తాతా ప్రసాద్, కిరణ్ కుమార్, లక్ష్మి లావణ్య మరియు విజయలక్ష్మి నేతృత్వంలో నిర్వహించగా, ఖైదీలలో నిచ్చులమైన ఆలోచనలకు, ఆత్మవిశ్వాసం పెంచేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని వారు తెలిపారు. యోగా ద్వారా మానసిక ఆందోళన, ఒత్తిడిని తగ్గించుకోవచ్చని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జైలు సూపరింటెండెంట్ వరుణారెడ్డి మాట్లాడుతూ ఖైదీల సంస్కరణలో భాగంగా ఇలాంటి ఆరోగ్య కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. భవిష్యత్తులో ఇలాంటి మరిన్ని కార్యక్రమాలను రూపొందించనున్నాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖైదీలు, జైలు సిబ్బంది, అధికారులు, యోగా శిక్షకులు పాల్గొన్నారు.

# ప్రజా ఫిర్యాదులకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలి

### జాప్యం లేకుండా వెంటనే పరిష్కరించాలి
### జిల్లా ఎస్పీ ఏ.ఆర్ దామోదర్
### పోలీస్ గ్రీవెన్స్‌కు 73 ఫిర్యాదులు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 26)

ప్రజా ఫిర్యాదులను పరిష్కారించుటకు సోమవారం జిల్లా ఎస్పీ ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (మీ కోసం) కార్యక్రమమును జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ నిర్వహించారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు వారి యొక్క సమస్యల గురించి స్వేచ్ఛగా జిల్లా ఎస్పీ కి, పోలీస్ అధికారులకు విన్నవించుకున్నారు. ఎస్పీ ఫిర్యాదులు గురించి సమగ్రంగా అడిగి తెలుసుకొని, వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. అందిన ఆయా ఫిర్యాదుల గురించి సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో మాట్లాడి ఆయా ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ఆయా ఫిర్యాదులపై తీసుకున్న చర్యలపై నివేదిక కూడా ఇవ్వాలన్నారు. సమస్యల పరిష్కారం కొరకు పోలీసు స్టేషన్లు, కార్యాలయాలకు వచ్చు పిర్యాదుదారులతో పోలీసు అధికారులు మరియు సిబ్బంది మర్యాదగా వ్యవహరించి చట్ట పరిధిలో వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు.





ఫిర్యాదుల్లో కొన్ని...

తన వాట్సప్ నెంబర్ కు ఒక మెసేజ్ వచ్చిందని కొంత అమౌంట్ ఇన్వెస్ట్మెంట్ చేసి టెలిగ్రామ్‌లో గేమ్ ఆడితే మనీ గెలవవచ్చునని ఆశ చూపి, విడతల వారీగా రూ.1,15,000లు వారి యొక్క అకౌంటు, ఫోన్ పే లకు డబ్బులు చెల్లించగా ఇంకా డబ్బులు కడితే మొత్తం డబ్బులు తిరిగి చెల్లిస్తామని సందేశం పంపగా మోసపోయానని గ్రహించిన కనిగిరి పట్టణానికి చెందిన ఒక మహిళ ఫిర్యాదు చేశారు. ఒంగోలులోని తన ఫ్యాక్టరీకి లోన్ ఇప్పిస్తామని గుంటూరుకు చెందిన ఒక వ్యక్తి వారి యొక్క క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ అనే పేరు మీద కొంత అమౌంట్ ఫిక్స్ డిపాజిట్ చేస్తే 50% సబ్సిడీ కూడా వస్తుందని నమ్మించి, తన వద్ద నుంచి ఫిక్స్ మరియు ఇతర లోన్ శాంక్షన్ కావటానికి మొత్తం 57 లక్షల రూపాయలు తీసుకొని, తదుపరి తను విచారించుకొని అటువంటి ఏ క్రెడిట్ సొసైటీ లేదని తెలుసుకొని త ́ న వద్ద నుండి డబ్బులు మోసపూరితంగా తీసుకున్నారని, డబ్బులు అడుగుతుంటే బెదిరిస్తున్నారని ఒంగోలుకు చెందిన ఒక వ్యక్తి ఫిర్యాదు. తన కుమారుడుకు విజయవాడ రైల్వే స్టేషన్ లో అవుట్ సోర్సింగ్ కంప్యూటర్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి తన వద్ద నుండి అడ్వాన్స్‌గా రూ.25,000 డబ్బులు ఫోన్ పే ద్వారా పేర్నమిట్ట మరియు విజయవాడ చెందిన ముగ్గురు వ్యక్తులు తీసుకోని ఉద్యోగం ఇప్పించకపోగా డబ్బులు అడుగుతుంటే ఇవ్వటం లేదని సంతనూతలపాడు మండలానికి చెందిన ఒక వ్యక్తి ఫిర్యాదు. ఈ కార్యక్రమంలో ఎస్బి డిఎస్పీ సురేష్ బాబు, సిసియస్ ఇన్స్పెక్టర్ జగదీష్, ఒంగోలు ట్రాఫిక్ సీఐ పాండు రంగారావు,

# లోకేష్‌కు బాధ్యతలిస్తే మరో 40 ఏళ్లు అధికారంలో తెలుగుదేశం

### జనసమీకరణ పై పులివెందుల నేతలతో చీఫ్ విప్ జీవీ, బీటెక్ రవి సమావేశం
### కడప మహానాడును విజయవంతం చేయాలని
### చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు పిలుపు

(షణ్ముఖ వెలుగు, వినుకొండ, మే 26)



మంత్రి లోకేష్‌కు ఇప్పుడే తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక అధ్యక్ష పదవి ఇస్తే పార్టీ 40ఏళ్లు అధికారంలోనే ఉంటుందన్నారు ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు. పార్టీలో, ప్రభుత్వంలో, ప్రజల్లో తనను తాను నిరూపించుకున్న ఆయనకు ఆ బాధ్యతలు ఇచ్చేందుకు ఇదే సరైన సమయమన్నారాయన. తెలుగుదేశం పార్టీ కోటిమంది క్రియాశీలక సభ్యత్వం గల కార్యకర్తలు, యువత, మేధావులు, విద్యావేత్తలు కూడా అదే ఆకాంక్షిస్తున్నారని తెలిపారు. కడపలో 3రోజులపాటు నిర్వహిస్తున్న మహానాడును విజయవంతం చేయాలని పిలుపునిచ్చిన ఆయన ఈ సందర్భంగానే లోకేష్‌ను కార్యనిర్వాహక అధ్యక్షుడిగా చూడాలని ఆశపడుతున్నట్లు చెప్పారు. సోమవారం ఈమేరకు పులివెందుల తెలుగుదేశం కార్యాలయంలో పార్టీ పరిశీలకుడు ఆదినారాయణ, బీటెక్ రవితో కలిసి నియోజకవర్గ ముఖ్యనేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన పులివెందులలో ఎక్కడికెళ్లినా మహానాడుపై విశేష స్పందన లభిస్తోందన్నారు. నియోజకవర్గం నుంచి 15 వేలమందికిపైగా తరలివెళ్తున్నారని చెప్పారు. ఈ మహానాడు ద్వారా తెలుగుదేశం పార్టీని రానున్న 4దశాబ్దాలకు మహాశక్తిగా మ లిచే ప్రయత్నం జరుగుతోందన్నారు. కడప ప్రాంతంలో సీఎం చంద్రబాబు హయాంలో చేపట్టిన పనులు బ్రహ్మాండంగా ముందుకెళ్లాయన్నారు. రాజశేఖర్‌రెడ్డి హయాంలో మొదలుపెట్టిన పనులు, పూర్తికాని వాటిని కూడా తర్వాత పూర్తి చేయడాన్ని ప్రజలంతా అభినందిస్తున్నారని తెలిపారు గోదావరి–బనకచర్ల ప్రాజెక్టు రాయలసీమ రైతులు రత్నాలు పండించే గొప్ప ప్రాజెక్టుగా పేర్కొన్నారు, వినుకొండ నియోజకవర్గంలో బొల్లాపల్లి జలాశయం ఏర్పాటుతో ఆ ప్రాంతంలో కొంతమంది నష్టపోయే పరిస్థితి ఉంటుందని, ఐనా బహుళార్థ ప్రయోజనాల దృష్ట్యా త్యాగాలు చేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. సీఎం చంద్రబాబు విజన్–2047 సాధించడానికి కూడా లోకేష్ లాంటి నవయువ నాయకత్వం అవసరం ఎంతో ఉందన్నారు. నాడు ఐటీ, ఎలక్ట్రానిక్స్, పంచాయతీ రాజ్ శాఖ మంత్రిగా, ప్రస్తుతం ఐటీ, విద్యాశాఖ మంత్రిగా అనేక సంస్కరణలు తీసుకొచ్చి ఆ శాఖలకే వన్నె తీసుకొస్తున్నారని పేర్కొన్నారు. వాట్సాప్ ద్వారానే 200కిపైగా పౌర సేవలు ఆయన కృషి కారణంగానే సాధ్యమైందన్నారు. పార్టీ పరంగా ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా.. కార్యకర్తలకు కొండంత అండగా నిలుస్తున్నారని, అనుకోని ఘటనల్లో బాధితులైన వారి కుటుం బాలు రోడ్డున పడకుండా వారి పిల్లలకు చదువు అందిస్తున్నారన్నారు. ప్రమాదాలకు గురై ఇబ్బందులు పడుతున్న వేలాదిమంది కార్యకర్తలను ఆదుకున్నారని తెలిపారు. పార్టీ క్లిష్ట పరిస్థి తుల్లో ఉన్నప్పుడు 400 రోజుల పాయు యువగళం పాదయాత్ర చేపట్టి అధికారంలోకి రావడా నికి కృషి చేసిన ఆయనకు కార్యనిర్వాహక అధ్యక్ష పదవి ఇవ్వడం, అది కూడా కడప మహా నాడు వేదికగానే చేయడం ఎంతో సముచితంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జీడీసీసీ చైర్మన్ మక్కెన మల్లికార్జున రావు స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న రైతు పోరుబాటను విజయవంతం చేయాలి

### వైసీపీ మండల కన్వీనర్ దుద్దుగుంట మల్లికార్జునరెడ్డి, జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు



(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, మే 26)

రాష్ట్రంలోని రైతులపై కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 28న పొదిలి పొగాకు బోర్డు వద్ద మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జగనన్న రైతు పోరుబాట కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుద్దుగుంట మల్లికార్జునరెడ్డి, జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. పొన్నలూరులో సోమవారం మండలంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో సీఎం చంద్రబాబు పూర్తిగా విఫలమయ్యారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో మాజీ సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి పంటలకు కనీస మద్దతు ధర కల్పించి రైతులను అన్ని విధాలుగా ఆదుకున్నారన్నారు. పొదిలి పొగాకు బోర్డు దగ్గర నిర్వహించే జగనన్న రైతు పోరుబాట కార్యక్రమంలో రైతులు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ జిల్లా కార్యాచరణ కార్యదర్శి కాటా మాధవరావు, కొండపి నియోజకవర్గం ప్రచార కమిటీ అధ్యక్షులు పల్నాటి వెంకటేశ్వరరెడ్డి, అన్ని గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.






# యోగా దినోత్సవంలో ప్రజల భాగస్వామ్యం

### పెంపుకై ప్రత్యేక దృష్టి పెట్టాలి
### జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 26)

యోగా దినోత్సవంలో ప్రజల భాగస్వామ్యం పెంపుపై మరింత దృష్టి పెట్టాలని అధికారులకు జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా చెప్పారు. ఈ అంశం పై సోమవారం ప్రకాశం భవనం నుంచి మండల స్థాయి అధికారులతో ఆమె ప్రత్యేక వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహించే యోగాసనాలలో మన జిల్లాలో 10 లక్షల మంది పాల్గొనేలా రిజిస్ట్రేషన్స్ చేయించాలని చెప్పారు. ప్రస్తుతం 4 లక్షల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని అధికారులు చెప్పగా, లక్ష్యం దిశగా దృష్టి సారించాలని కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ట్రైనర్స్ ద్వారా ప్రజలకు శిక్షణ ఇప్పిస్తామని, ఇందులో భాగంగా తొలుత ట్రైనర్స్‌కు అవసరమైన శిక్షణను మంగళవారం నుంచి మండల స్థాయిలో మాస్టర్ ట్రైనర్స్ ద్వారా శిక్షణ ఇచ్చేలా ప్రణాళిక రూపొందించామన్నారు. ఈ ప్రక్రియను పర్యవేక్షించాలని ఎంపిడిఓలను, మున్సిపల్ కమిషనర్లను ఆమె ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ మాట్లాడుతూ వచ్చే నెల 2, 8, 15వ తేదీలలో ప్రత్యేక ఇతి వృత్తాలతో పర్యాటక ప్రాంతాలైన త్రిపురాంతకం ఆలయం, పాకల బీచ్, కొత్తపట్నం బీచ్ లలోనూ భారీస్థాయిలో యోగాసన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జడ్పీ సీఈఓ చిరంజీవి, శిక్షణా కార్యక్రమాల నోడల్ ఆఫీసర్ బిసి కార్పోరేషన్ ఈడి వెంకటేశ్వరరావు, హౌసింగ్ పీడీ శ్రీనివాస ప్రసాద్, డ్వామా పీడీ జోసఫ్ కుమార్, డిపిఓ వెంకట నాయుడు, సిపిఓ వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు. తమ శాఖలకు సంబంధించిన కార్యకలాపాల పైన జిల్లా అధికారులు తొలుత సమీక్షించారు.


On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com